జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

కృష్ణ | ఆదివారం 2 ఆగస్టు 2026 | సంపుటి : 01 | సంచిక :199 | పేజీలు : 12 | వెల : 3/- | PRGI No. APTEL/26/A0119,

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.
అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు
9440231967

శ్రీ పరాభవ నామ సంవత్సరం ఆషాఢ మాసం గ్రీష్మ ఋతువు దక్షిణాయనం పర్వదినం: సికింద్రాబాద్ బోనాలు, స్పెషల్ ఉత్సవం సూర్యోదయం: 5.40 ; సూర్యాస్తమయం: 6.27 చంద్రోదయం: 9.03 ; చంద్రాస్తమయం: 8.35 తిథి: బహుళ చవితి రా. 9.07 వరకు, తదుపరి పంచమి నక్షత్రం: పూర్వాభాద్ర రా. 8.41 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర యోగం: అతిగండం రా. 10.34 వరకు, తదుపరి సుకర్మ కరణం: బవ ఉ. 9.15 వరకు, తదుపరి బాలువ రా. 9.07 వరకు, తదుపరి కౌలవ

Published from KRISHNA, GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com





## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# కొత్త రన్‌వే..

ఈ గడ్డపై అడుగుపెట్టడం ఎంతో గర్వకారణం.. ఉత్తరాంధ్ర పర్యటనలో ప్రధాని నరేంద్ర మోదీ

- రూ.18 వేల కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం
- భోగాపురం ఎయిర్‌పోర్ట్‌కు అల్లూరి సీతారామరాజు పేరు ఖరారు
- గిరిజన మహిళల థింసా నృత్యం ప్రపంచ రికార్డు సాధించిందన్న ప్రధాని
- చంద్రబాబు దార్శనికతను మనస్ఫూర్తిగా అభినందించిన మోదీ

3




### ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం

- మోదీని విమర్శిస్తుంటే బాధపడ్డా: డిప్యూటీ సీఎం పవన్
- ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ కీలకమన్న పవన్
- దేశాన్ని మోదీ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని ప్రశంస
- చంద్రబాబు మార్గనిర్దేశంలో ఏపీ అగ్రగామి రాష్ట్రంగా మారుతుందని ధీమా



## ప్రమాదకరంగా


# గోదావరి

- అంతకంతకూ పెరుగుతున్న ప్రవాహం
- రాజమహేంద్రవరం వద్ద క్రమంగా పెరుగుతున్న గోదావరి ఉధృతి
- 175 గేట్లు ఎత్తి వచ్చిన వరద నీటిని వచ్చినట్లుగా వదులుతున్న అధికారులు
- వరద ఉధృతితో పలు మండలాలకు నిలిచిపోయిన రాకపోకలు



**అమరావతి**

రాజమహేంద్రవరం వద్ద గోదావరి ఉధృతి క్రమంగా పెరుగుతోంది. ఎగువన రాష్ట్రాలతో పాటు, తెలంగాణలో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద పోటెత్తుతోంది. ప్రమాదకర స్థాయికి చేరుకుంది. ధవళేశ్వరం వద్ద నీటిమట్టం 13 అడుగులకు చేరడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. ప్రస్తుతం 11.46 లక్షల క్యూసెక్కులకు పైగా నీరు దిగువకు ప్రవహిస్తుండగా అంతకంతకూ పెరుగుతోంది. భద్రాచలం నుంచి భారీగా వరద - మిగతా3లో



### వెన్నుపోటు కూటమి

## అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి

- 'నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా ప్రోత్సహించింది జగనే
- వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి
- వైఎస్సార్‌సీపీ కమిటీల్లో 10 వేల మంది నాయీ బ్రాహ్మణులకు స్థానం
- పార్టీ నిర్మాణంలో బీసీలకు 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం
- జగన్ హయాంలో 15--20 ఏళ్ల అభివృద్ధి, సంక్షేమం అందింది.

**అమరావతి**

తాడేపల్లి: వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలని వైఎస్సార్‌సీపీ స్టేట్ కో–ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం, ఆగస్టు 1వ తేదీ తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో నాయీ బ్రాహ్మణులతో సమావేశం నిర్వహించారు - మిగతా3లో

## క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి



- బాధిత కుటుంబాలను పరామర్శించని ప్రధాని
- విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని వ్యాఖ్య
- తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం
- వేదాలు, రామాయణ, మహాభారతాల్లోనే మధ్యవర్తిత్వ సూత్రాలున్నాయని వెల్లడి



## నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

- నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

# క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ "క్షమాపణలు" చెప్పాలని, అంతేకానీ వారిని "క్షమించడం" కాదని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తమిళనాడులోని మామల్లపురంలో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. అనంతరం ఎక్స్‌లో పోస్ట్‌లో కేంద్రప్రభుత్వంపై, ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "కోల్పోయిన ప్రతి చిన్నారి ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని వేదనను మోస్తున్న ఒక కుటుంబం ఉంటుంది. అలాగే, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది. విద్యార్థులతో నిజాయతీగా ఉండని వ్యవస్థలో, మన విద్యార్థులను నిజాయతీగా చదవమని చెబుతున్నారు. అయినా, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడేంత ధైర్యం ప్రధానమంత్రికి ఉంది. బిడ్డలను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క తల్లి, తండ్రిని కూడా మోదీ కలవలేదు. లీక్ అయిన ప్రశ్నపత్రం వల్ల భవిష్యత్తు నాశనమైన ఒక్క విద్యార్థితో కూడా ఆయన కూర్చోని మాట్లాడలేదు."



మరోవైపు, తన సందేశంలో యువ నిరసనకారులు ఉపయోగించిన భాషపైనే మోదీ దృష్టి సారించారని, కానీ నిరసనకారుల పట్ల ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిని ప్రస్తావించడంలో విఫలమయ్యారని వామపక్ష విద్యార్థి సంఘం ఐసా పేర్కొంది. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న నిరసనకారులపై లాఠీలు, పెల్లెట్లు, బుల్లెట్లు ప్రయోగించడం, అలాగే అసమ్మతివాదులపై ఆన్‌లైన్ ట్రోలింగ్, డాక్సింగ్, బెదిరింపులే "అసలైన సాంస్కృతిక షాక్" అని అది ఆరోపించింది.

ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రధాని మోదీ శుక్రవారం మరో వీడియో పోస్ట్ చేశారు. అందులో ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏం జరిగిందో భారత్‌తోపాటు ప్రపంచ దేశాలన్నీ చూశాయని, కొంతమంది ఆకతాయి యువత దుర్భాషలాడటం, అసభ్యకరమైన పదాలు వాడటం, తనను, తన దివంగతురాలైన మాతృమూర్తిని కూడా దూషించారని పేర్కొన్నారు. అయితే, యవ్వనంలో ఇటువంటి తప్పులు సహజమని, దారి తప్పినవారిని సరైన మార్గంలో నడిపించడం మన కర్తవ్యమని మోదీ తెలిపారు. తనపై దుర్భాషలాడిన వాళ్లను శిక్షించడం, కోర్టు చుట్టు తిప్పడం వంటివాటితో పరిస్థితిలో మార్పు రాదని, అలా చేసిన వారిని క్షమిస్తున్నట్లు ఒక సందేశాన్ని పోస్టు చేశారు. తప్పుల నుంచి నేర్చుకుని ముందుకెళ్లాలని, దేశాభివృద్ధిలో కలిసి రావాలని యువతకు సూచించారు.

కాగా, దిల్లీ విద్యార్థుల నిరసన కార్యక్రమంలో మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదైన బాలికకు సంబంధించిన క్షమాపణ వీడియో ఒకటి వైరల్‌గా అయ్యింది. తన వ్యాఖ్యలపై తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ దేశ ప్రజలకు క్షమాపణ కోరింది. చేతులు జోడించి కనిపించిన ఆమె, నిరసన కార్యక్రమంలో కొందరి ప్రభావానికి లోనై ప్రధానిపై తీవ్ర వ్యాఖ్యలు చేశానని పేర్కొంది. నిరసన సమయంలో కొంతమంది చెప్పిన మాటలకు ప్రభావితమై ప్రధానమంత్రి గురించి చాలా తప్పుగా మాట్లాడానని తెలిపింది. తాను చేసిన పని క్షమించరానిదని, తన వల్ల పెద్ద తప్పు జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, అదే తన జీవితంలో మొదటి, చివరి తప్పు అని ఆమె స్పష్టం చేసింది. అలాగే, దేశ ప్రజలందరికీ చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నానని, తాను చేసిన పనికి చాలా సిగ్గుగా ఉందని,ఆ బాలిక వీడియోలో విజ్ఞప్తి చేసింది.

# కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా?

న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం చేసే సిఫారసులకు తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇంకా రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లీగల్ థింక్ టాంక్ 'విధి'కి చెందిన జీూాణ× ఇనిషియేటివ్ రూపొందించిన ఒక రిపోర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ అక్కడ జరిగిన ఒక చర్చలో కొలీజియం శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మూడు కొలీజియం తీర్మానాల్లో న్యాయమూర్తుల పదోన్నతులు, నియామకాలకు సంబంధించి కారణాల్ని వెల్లడించలేదని అన్నారు.

"గడిచిన 3 కొలీజియాల తీర్మానాలను నేను నిశితంగా గమనించా. అందులో నియామకాలకు సంబంధించి ఎలాంటి కారణాలూ వెల్లడించలేదు. ఇది పారదర్శకత సూత్రం నుంచి వెనక్కి తగ్గడం కాదా? కొలీజియం తీర్మానాలు ఇప్పుడు చూస్తుంటే ఒకే మూస పద్ధతిలో, కాపీ-పేస్ట్ చేసినట్లుగా కనిపిస్తున్నాయి."



**రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేసే వారికే చోటు!**

కారణాలు చెప్పకుండా రహస్యంగా నియామకాలు చేపట్టడం వల్ల అనర్హులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు. గతంలో ఒక హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒక వర్గం ప్రజల్ని ఉద్దేశించి 'చీమలు' అన్నారని, మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదంతాల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

**'ఎవరిని ఎందుకు సిఫార్సు చేస్తున్నామో తెలియాలి'**

కారణాలు దాచడం ద్వారా కొలీజియం అద్భుతంగా పనిచేసే నిజాయతీ గల జడ్జిలకు ద్రోహం చేయడమే కాకుండా, న్యాయ వ్యవస్థలోకి అనుచిత వ్యక్తులు వచ్చేందుకు స్థానం కల్పిస్తోంది. అటువంటి వారు రేపటి రోజున వ్యవస్థలోకి వచ్చి ఒక వర్గం ప్రజల్ని చీమలు అని సంబోధిస్తూ రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంది' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఉదహరించారు. న్యాయవ్యవస్థలోకి అలాంటి వ్యక్తులు రాకుండా అడ్డుకోవాలంటే, ఎవరిని ఎందుకు ఎంపిక చేస్తున్నామో, ఎందుకు తిరస్కరిస్తున్నామో తెలిపేలా సరైన చర్చలు జరగాలని, కారణాల్ని కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కనీసం సిఫార్సులకు కారణాలైనా వెల్లడించేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయం అసలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఇక్కడ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. అయితే 2024లో విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో పాల్గొన్న అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. అప్పుడు ఆ జడ్జి 'మన సంస్కృతిలో చిన్న చిన్న జంతువులకు కూడా హాని చేయకూడదని, చీమలను కూడా చంపకూడదని నేర్పుతారు. ఇది మనలో బలంగా నాటుకుపోయింది. కానీ మీ సంస్కృతిలో చిన్నప్పటి నుంచే జంతువుల వధను చూస్తారు. మీలో సహనం, కరుణ ఎలా ఆశించగలం' అంటూ వ్యాఖ్యానించగా, దీనిపై అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

**వివాదాలకు దారితీస్తున్న వ్యాఖ్యలు**

మరోవైపు ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ కూడా ఒక సందర్భంలో కొందరిని 'కాక్రోచ్ (బొద్దింకలు)' అని వర్ణించడం వివాదాస్పదమైంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో చీజుజు (నీట్ పరీక్ష) పేపర్ లీక్ అంశంపై పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన ఉద్యమం కూడా చెలరేగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా కూడా చేశారు. అయితే కొలీజియం వ్యవస్థలపై వచ్చే విమర్శలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గతంలో స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సుప్రీం కోర్టుకు లేదా హైకోర్టులకు న్యాయమూర్తుల్ని సిఫార్సు చేసే సమయంలో వారి పనితీరు, న్యాయమూర్తిగా అందించిన సుదీర్ఘ సేవలు, గతంలో వారు నిర్వహించిన బాధ్యతల్ని, వృత్తిపరమైన అనుభవం వంటి అనేక అంశాల్ని పరిశీలించిన తర్వాతే కొలీజియం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు.

# ఇథనాల్ కలపకపోతే పెట్రోల్ ధర లీటరుకు రూ.125 అయ్యేది!

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ దేశంలో పెట్రోల్ ధరలు అదుపులో ఉండేందుకు ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (జుదీూ) కార్యక్రమమే ప్రధాన కారణమని కేంద్రం స్పష్టం చేసింది. ఇథనాల్ మిశ్రమం అమలు చేయకపోయి ఉంటే దేశ రాజధాని దిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు ఏకంగా రూ. 125 కు చేరేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పేర్కొంది. మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, భారత క్రూడ్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు 135 డాలర్ల వరకు పెరిగిన సమయంలో కూడా దిల్లీలో వినియోగదారులు లీటర్ పెట్రోల్‌కు రూ. 94.77 మాత్రమే చెల్లించారు.

**ప్రజలకు లీటరుకు రూ. 30 వరకు ఆదా!**

ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకు దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను కాస్త తక్కువ ధరలకు, ముందస్తుగా నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయడం వల్ల అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల ప్రభావం తగ్గిందని పెట్రోలియం శాఖ వివరించింది. దీంతో ఆ సంక్షోభ సమయంలో కూడా వినియోగదారులకు లీటరుపైనే దాదాపుగా రూ. 30 వరకు ఆదా అయినట్లు తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యం రోజూ చౌకైన ఇంధనం అందించడం కాదని, ప్రపంచ చమురు మార్కెట్లో ఏర్పడే తీవ్రమైన ధరల ఒడుదొడుకుల నుంచి భారత వినియోగదారుల్ని రక్షించడం, దేశ ఇంధన భద్రతను మరింత బలోపేతం చేసేందుకు దోహదం చేయడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు సుమారు రూ. 1.97 లక్షల కోట్లకుపైగా విదేశీ మారకద్రవ్యం ఆదా




అయిందని కేంద్రం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా 316 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ముడి చమురు దిగుమతులకు ప్రత్యామ్నాయం లభించింది. ఇదే సమయంలో 950 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గినట్లు తెలిసింది.

**పన్ను చెల్లింపుదారుల డబ్బు కాదు- ఇదో ఎనర్జీ ఇన్సూరెన్స్!**

మరోవైపు ఇథనాల్ బ్లెండింగ్ పథకం టాక్స్ పేయర్ల సబ్సిడీలపై నడుస్తుందనే విమర్శల్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో నడిచే సబ్సిడీ కాదని, దేశ ఇంధన భద్రతకు రక్షణ కవచంలా పనిచేసే వ్యూహాత్మక కార్యక్రమం అని, ఎనర్జీ ఇన్సూరెన్స్ వంటిదని వెల్లడించింది. 'ఇది పన్నుల డబ్బుతో నడిచే సబ్సిడీ కానే కాదు. భారత ఇంధన భద్రతకు ఒక రక్షణ బీమా (ఎనర్జీ ఇన్సూరెన్స్) వంటిది. అంతర్జాతీయంగా తీవ్ర చమురు సంక్షోభం వచ్చినప్పుడు ఈ విధానం దేశాన్ని ఎలా కాపాడిందో ఇప్పటికే నిరూపితమైంది' అని తెలిపింది.

**తగ్గనున్న చమురు దిగుమతులు**

అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రైతులు, డిస్టిలరీలకు రూ. 1.66 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు (డైరెక్ట్ పేమెంట్స్) జరిగాయని కేంద్రం వెల్లడించింది. దీంతో వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంకా ప్రస్తుతం సుమారు 88 శాతంగా ఉన్న దేశ చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంలో ఇథనాల్ బ్లెండింగ్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాగే ప్రపంచ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగినా దేశీయంగా ఇంధన ధరల్ని నియంత్రించేందుకు ఈ కార్యక్రమం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపింది.

ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు చమురు విషయంలో దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్ వంటి పలు దేశాల్ని ఎలాంటి ఇబ్బందులకు గురిచేశాయో తెలిసిందే. ఇరాన్- అమెరికా యుద్ధం సమయంలో 2 నెలల కిందట ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 126 డాలర్ల వరకు పెరిగింది. అప్పుడు దేశీయంగా కూడా చమురు సంస్థలు చాలా కాలం తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల్ని 2-3 దఫాల్లో లీటరుపై రూ. 7 వరకు పెంచేశాయి. తర్వాత ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర తగ్గి ప్రస్తుతం 88 డాలర్లకు దిగొచ్చినా దేశీయంగా రిటైల్ ధరల్ని మళ్లీ తగ్గించలేదు. దిల్లీలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12 గా ఉండగా, డీజిల్ ధర రూ. 95.20 గా ఉంది. హైదరాబాద్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ రేట్లు లీటరుపై వరుసగా రూ. 115.73, రూ. 103.82 గా ఉన్నాయి.

## భూమిపై కురుస్తున్న అంతరిక్ష చెత్త..

అంతరిక్ష రంగంలో ప్రయోగాలు వేగవంతం అవుతున్న కొద్దీ, భూమికి కొత్త ముప్పు పొంచి ఉంది. ప్రతి వారం సుమారు ఒక మెట్రిక్ టన్ను (1000 కిలోలు) బరువున్న అంతరిక్ష శకలాల వర్షం భూమిపై కురుస్తోందని తాజా నివేదికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెరిగిపోతున్న రాకెట్ ప్రయోగాలు, వేల సంఖ్యలో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల కారణంగా ఈ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పోలెండ్ అంతరిక్ష సంస్థకు చెందిన నిపుణుడు మారియస్ స్లోనినా వెల్లడించిన వివరాల ప్రకారం, దాదాపు ప్రతిరోజూ అంతరిక్షం నుంచి ఏదో ఒక వస్తువు భూ వాతావరణంలోకి ప్రవేశిస్తోంది. ఇలా వారానికి సగటున ఒక టన్ను శకలాల చొప్పున భూమిని చేరుతున్నాయి. అమెరికా స్పేస్ ఫోర్స్ గణాంకాలు ఈ పెరుగుదలను స్పష్టంగా చూపుతున్నాయి. దశాబ్దం క్రితం ఏడాదికి సుమారు 110 వస్తువుల పునఃప్రవేశంపై హెచ్చరికలు జారీ చేస్తే, 2025 నాటికి ఆ సంఖ్య 820కి పెరిగింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా రాకెట్ ప్రయోగాలు జరగడమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా అంతరిక్ష శిథిలాల్లో అధిక భాగం భూ వాతావరణంలోకి ప్రవేశించగానే ఘర్షణకు గురై మండిపోతాయి. మిగిలినవి సముద్రాల్లో పడిపోతాయి. అయితే, కొన్నిసార్లు పెద్ద పరిమాణంలో ఉండే భాగాలు పూర్తిగా కాలిపోకుండా భూమిపై పడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కెన్యాలోని ముకుకు గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలో 16 ఏళ్ల క్రితం ప్రయోగించిన రాకెట్‌కు చెందిన భారీ లోహపు రింగ్ ఒకటి కూలిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి విడివడిన ఒక శిథిలం అమెరికాలోని ఫ్లోరిడాలో ఒక ఇంటిపై పడింది. పోలెండ్‌లో స్పేస్‌ఎక్స్ రాకెట్‌కు చెందిన భాగాలు, స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో చైనాకు చెందిన పాత ఉపగ్రహ శకలాలు, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. అంతరిక్ష శిథిలాల వల్ల ఒక వ్యక్తి గాయపడే అవకాశం, పిడుగు పడే సంభావ్యత కంటే చాలా తక్కువ అని నిపుణులు చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం క్రమంగా పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. 2035 నాటికి కేవలం స్పేస్‌ఎక్స్ ఉపగ్రహాల శిథిలాల వల్ల ప్రతి రెండేళ్లకు ఒకరు గాయపడటం లేదా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం అంచనా వేసింది. ఈ ముప్పును నియంత్రించడానికి స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రూపొందించిన ఐక్యరాజ్యసమితి ఒప్పందాలు నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. 2007లో జారీ చేసిన మార్గదర్శకాలకు చట్టబద్ధత లేదు. అనియంత్రిత శిథిలాలు ఎక్కడ పడతాయో కచ్చితంగా అంచనా వేయడం కూడా చాలా కష్టం. కేవలం ఒక్క నిమిషం అంచనా తప్పినా, శిథిలాలు పడే ప్రదేశం దాదాపు 300 మైళ్ల వరకు మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో, శిథిలాలు పూర్తిగా కాలిపోయేలా వస్తువులను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నా, దానిని తప్పనిసరి చేసే చట్టాలు లేవు. సాంకేతికత వేగంగా ముందుకు వెళ్తున్నా, దానివల్ల తలెత్తే పర్యవసానాలను ఎదుర్కోవడానికి అవసరమైన నియంత్రణ వ్యవస్థలు వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

## నీట్ యూజీ 2026:
## ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం



నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది. నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్‌టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్టే వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్‌టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది




వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు. భారతీయ సంప్రదాయంలో వివాద పరిష్కారానికి తొలుత కుటుంబం (కుల), తర్వాత వర్గం (శ్రేణి), ఆపై సభ (పుగ) వద్దకు వెళ్లేవారని, ఇవన్నీ విఫలమైనప్పుడే రాజును ఆశ్రయించేవారని తెలిపారు. అంటే ఏ సమస్యకైనా మొదటి అడుగు ఎప్పుడూ సంప్రదింపులేనని ఆయన వివరించారు. ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక పరిష్కారం కుదర్చడమే తన న్యాయవాద వృత్తిలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధం కావడానికి ముందే భారతీయుల రక్తంలో ప్రవహిస్తోందని, అది మన సంస్కృతిలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో వివరించారు.

# ప్రమాదకరంగా గోదావరి

-మొదటిపేజీ తరువాయి

నీరు వస్తుండగా ధవళేశ్వరం వద్ద 15 లక్షల క్యూసెక్కులకు చేరనుందని, రెండో ప్రమాద హెచ్చరిక సైతం జారీ చేసే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు. సముద్రంలోకి సుమారు 11.46 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేస్తున్నారు. కోనసీమ జిల్లాలో పలు లంక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కాజ్‌వే కొట్టుకుపోవడంతో లంక గ్రామాల వాసులు బోట్లు ఎక్కి ప్రయాణం సాగిస్తున్నారు. తూర్పుగోదావరి, కోనసీమ, పోలవరం జిల్లాల్లో అధికార యంత్రాంగం సహాయక చర్యలు ముమ్మరం చేసింది. ప్రజలకు హెచ్చరికలు జారీ చేస్తూ, వారికి ఇబ్బంది లేకుండా ముందస్తుగా ప్రత్యామ్నాయ శిబిరాలు సైతం సిద్ధం చేస్తున్నారు.

లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 17 మండలాలు, 32 లంకగ్రామాలకు వరదముప్పు ఉన్నట్లు గుర్తించిన అధికారులు ముందస్తుగా సహాయక చర్యలకు సిద్ధమవుతున్నారు. వరద దృష్ట్యా జిల్లాలో సిబ్బంది, అధికారులకు సెలవులను కలెక్టర్ రద్దు చేశారు. బ్యారేజ్ నుంచి దిగువన ఉన్న గౌతమి, వృద్ధ గౌతమి, వశిష్ఠ, వైనతేయ నదీపాయలు పోటెత్తి ప్రవహిస్తున్నాయి. బ్యారేజ్‌కు దిగువున ఉన్న లంకగ్రామాల ప్రజలు మరపడవల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు.

లంక గ్రామాల్లో జాయింట్ కలెక్టర్ పర్యటించి అధికారులకు వరద హెచ్చరికలపై దిశానిర్దేశం చేశారు. పి.గన్నవరం మండలం బూరుగులంక రేవులో వరద రేవు పరిస్థితిని అధికారులు అంచనా వేశారు. విద్యార్థులు, గర్భిణీలు, వృద్ధులు ఎవరూ ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కోనసీమలో వివిధ నదీపాయల్లో తాత్కాలిక బాటలు తెగిపోయాయి. ఏలూరు జిల్లా వేలేరుపాడు మండల పరిధిలో వరద ఉధృతి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.



భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ: తెలంగాణలోని భద్రాచలం వద్ద గోదావరి ఉగ్రరూపు దాల్చింది. ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రవాహం పోటెత్తుంది. గోదావరి నీటిమట్టం 54.8 అడుగుల చేరింది. దీంతో అధికారులు మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరిలో 14.26 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. పోటెత్తుతున్న వరదతో స్నానఘట్టాలు, కళ్యాణకట్ట, విద్యుత్ స్తంభాలు మునిగిపోయాయి.

వరద ఉధృతితో పలు మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. చర్లలోని తూరుబాక వద్ద రోడ్డు పైకి నీరు చేరింది. వరద నీటితో చింతూరు, కూనవరం, వీఆర్ పురం మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు 43 అడుగుల వద్దకు చేరుకోగా అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. మధ్యాహ్నం మూడున్నర గంటలకు 48 అడుగులకు చేరుకోవడంతో రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ప్రస్తుతం 55 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. ఎగువ నుంచి వస్తున్న వరదనీటితో రాజమహేంద్రవరం వద్ద ప్రవాహం పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం 11.75 అడుగులకు చేరింది. ధవళేశ్వరం బ్యారేజీ 175 గేట్లు ఎత్తి సముద్రంలోకి 10 లక్షల క్యూసెక్కుల వరద నీరు విడుదల చేశారు.

గోదావరి నీటిమట్టం పెరుగుతున్నందు వల్ల ప్రజలకు అందుబాటులో ఉండేందుకు అధికారులు కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు.

కోనసీమ జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ – 08856 – 293104

అమలాపురం కంట్రోల్ రూమ్ – 08856 – 233208

రామచంద్రపురం కంట్రోల్ రూమ్ – 08857 – 245166

కొత్తపేట కంట్రోల్ రూమ్ – 85002 – 38258, 08855 – 244299

# మండలి కోసం వడపోతలు షురూ

**విజయవాడ :** ఆంధ్రప్రదేశ్ శాసన మండలి లో గవర్నర్ కోటాకు చెందిన రెండు సభ్యుల పదవీకాలం ముగియడంతో కొత్త నియామకాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ఇప్పటివరకు ఈ స్థానాల్లో కొనసాగిన పందుల రవీంద్ర , జకియా ఖానం పదవీకాలం ముగియడంతో ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ ( ఈ రెండు స్థానాలను భర్తీ చేసే అవకాశం ఉండటంతో పలువురు నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు.ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల కోసం పార్టీలోనే తీవ్ర పోటీ నెలకొన్నట్లు తెలుస్తోంది. గత ఎన్నికల్లో టికెట్ దక్కని నాయకులు, పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు, పార్టీ కోసం త్యాగం చేసిన వారు, సామాజిక సమీకరణాల్లో కీలక పాత్ర పోషించే నేతలు తమ పేర్లను పరిశీలించాలని అధిష్ఠానాన్ని కోరుతున్నట్లు సమాచారం. సామాజిక వర్గాల సమతుల్యతను దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకునే అవకాశముందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మిత్రపక్షాలకు ఈ స్థానాలను కేటాయించకుండా రెండింటినీ టీడీపీనే భర్తీ చేస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే సంకేతాలు ఇచ్చినట్లు రాజకీయ చర్చ సాగుతోంది. దీంతో పార్టీ అంతర్గతంగా పోటీ మరింత పెరిగింది. ఎవరికీ అవకాశం దక్కుతుందన్న అంశంపై నాయకుల్లో ఉత్కంఠ నెలకొంది.ప్రస్తుతం అసెంబ్లీలో టీడీపీకి స్పష్టమైన మెజారిటీ ఉంది. దీంతో ప్రభుత్వానికి అవసరమైన బిల్లులు సులభంగా ఆమోదం పొందుతున్నాయి. అయితే శాసన మండలిలో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. అక్కడ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వానికి ప్రతి అంశంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. కొన్ని కీలక బిల్లులపై మండలిలో తీవ్ర చర్చలు జరగడంతో పాటు ప్రభుత్వానికి ఆశించిన ఫలితాలు రాకపోయిన సందర్భాలు కూడా ఉన్నాయిఇటీవల ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొన్ని కీలక బిల్లులు శాసన మండలిలో ఆశించిన విధంగా ఆమోదం పొందలేదు. పార్టీ నేత తోట చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించే ప్రతిపాదనతో తీసుకొచ్చిన బిల్లు మండలిలో నిలిచిపోయింది. అలాగే పీపీపీ విధానంలో కొన్ని మెడికల్ కాలేజీల నిర్వహణను ప్రైవేటు సంస్థలకు అప్పగించే అంశం కూడా తీవ్ర చర్చకు దారి తీసింది. ఈ పరిణామాలు మండలిలో ప్రభుత్వ వాదనను మరింత బలంగా వినిపించే నాయకుల అవసరాన్ని టీడీపీ ముందుకు తెచ్చాయి. అందుకే సభలో దూకుడుగా వాదించే, ప్రతిపక్ష విమర్శలకు సమర్థంగా సమాధానం చెప్పగల నాయకులను ముందుకు తీసుకురావాలనే ఆలోచనకు పార్టీ ప్రాధాన్యం ఇస్తోందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.ఈ వ్యూహంలో భాగంగానే శ్రీకాకుళం (కు చెందిన కావలి



గ్రీష్మకు అవకాశం కల్పించారు. ఆమె పార్టీ తరఫున చురుకుగా వ్యవహరిస్తున్నప్పటికీ, మండలిలో మరింత దూకుడుగా వాదించే నాయకులు అవసరమనే అభిప్రాయం కొందరిలో వ్యక్తమవుతోంది. అందుకే ఈసారి బలమైన వాక్చాతుర్యం కలిగిన, ప్రతిపక్షంపై సమర్థంగా ఎదురుదాడి చేయగల నేతలను ఎంపిక చేసే అవకాశాలను పరిశీలిస్తున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.ఇదే సమయంలో సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సేవలు, భవిష్యత్ రాజకీయ అవసరాలు వంటి అంశాలను కూడా టీడీపీ నాయకత్వం పరిగణనలోకి తీసుకుంటుందని తెలుస్తోంది. పార్టీకి విధేయతతో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వాలనే అభిప్రాయం కూడా ఉంది. మొత్తంగా ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల భర్తీ కేవలం నామినేషన్ ప్రక్రియ మాత్రమే కాకుండా, రాబోయే రాజకీయ వ్యూహాలకు కూడా కీలకంగా మారే అవకాశం కనిపిస్తోంది. అందుకే తుది ఎంపికపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.శాసన మండలిలో ఖాళీ అయిన.. రెండు స్థానాలను భర్తీ చేసే విషయంపై టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు మౌనంగా ఉన్నారు. ఈ రెండు సీట్లు కూడా గవర్నర్ కోటాలో భర్తీ చేసేవే కావడం గమనార్హం. ప్రస్తుతం కూటమి సర్కారుకు గవర్నర్ అనుకూలంగానే ఉన్న నేపథ్యంలో ప్రబుత్వం తీసుకునే నిర్ణయానికి పెద్దగా ఎలాంటి ఇబ్బందులు ఉండే అవకాశం లేదు. దీంతో ఎవరిని ఎంపిక చేసినా ఇట్టే వారు మండలిలో కూర్చుంటారు. దీంతో నాయకులు మరిన్ని ఆశలు పెట్టుకున్నారు. గతంలో తెలంగాణలో గవర్నర్ కోటా ఎమ్మెల్సీ ఎంపిక వివాదం అయింది. సుప్రీంకోర్టు వరకు సాగింది. అయితే.. ఇలాంటి వివాదాలు ఏపీలో కనిపించడం లేదు. దీంతో బాబు నిర్ణయమే ఫైనల్ అన్నట్టుగా ఉంది. ఇది నాయకుల్లో మరిన్ని ఆశలు రేకెత్తిస్తోంది. అయితే.. తాజాగా సీనియర్ నాయకులతో సచివాలయంలో చంద్రబాబు భేటీ అయినా.. ఈ విషయంపై ఆయన ఎక్కడా స్పందించలేదు. ఇది మరింతగా నాయకుల్లో టెన్షన్ పెంచుతోంది. ఇటీవల రాజ్యసభ ఎన్నిక ల సమయంలోనూ టీడీపీ కోటాలో ఎంపిక చేసేవారి పేర్లను ఇంతే గోప్యంగా ఉంచారు. ఫలితంగా ఆశలు పెట్టుకున్నవారు.. చివరి వరకు ఎంతో ఉత్కంఠగా ఎదురు చూశారు. ఎంపిక ప్రక్రియ అయిపోయిన తర్వాత..ఆశలు పెట్టుకున్న అందరూ నిరుత్సాహానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు కూడా బాబు బాంబు పేలుస్తారా? అనేది చర్చకు దారితీసింది. అలా వద్దని.. సడెన్‌గా పేర్లను వెల్లడిస్తే.. కేడర్‌లో చులకన అవుతున్నామని ఆశావహులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని, అయితే.. ఆ నిర్ణయమేదో సాధ్యమైనంత త్వరగా ప్రకటిస్తే.. కేడర్‌ను సంతృప్తి పరిచేందుకు.. తమ ఫ్యామిలీలను సంతృప్త పరిచేందుకు కూడా అవకాశం ఉంటుందని అంటున్నారు. మొత్తంగా ఈ విషయంపై టీడీపీలో చర్చ సాగుతోంది. కొందరు నాయకులు వస్తుందో రాదో అన్న బెంగతో తరచుగా ఫోన్లు కూడా చేస్తున్నారు. మరి చంద్రబాబు ఎ వరిని కరుణిస్తారో చూడాలి. ఏదేమైనా సడెన్‌గా కాకుండా ముందుగానే ప్రకటించాలని నాయకులు కోరుతున్నారు.

## వీర మహిళలకు పెద్ద పీట....

కాకినాడ

జనసేన అధినేత పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. పార్టీ పదవుల్లోనూ, ఇకపై ప్రభుత్వ నియామకాల్లోనూ మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత కొన్ని రోజులుగా పార్టీ పదవులపై కసరత్తుచేస్తున్న పవన్ కల్యాణ్ జనసేనలో మహిళలకు ప్రాధాన్యత తక్కువగా ఉందని గుర్తించారు. అలాగని జనసేనలో మహిళనేతలకు కొదవలేదు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఒకే ఒక మహిళకు మాత్రమే అవకాశం ఇచ్చారు. నామినేటెడ్ పదవుల్లో కొందరికి కట్టబెట్టినా వారు పెద్దగా హైలెట్ కాలేదు. అందుకే ఈసారి పార్టీ పదవుల్లో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని పవన్ కల్యాణ్ నిర్ణయించినట్లు తెలిసింది. నేతలు ఏదో ఒక వివాదంలో చిక్కుకోవడం పవన్ కల్యాణ్ కు ఇబ్బందిగా మారింది. అదే మహిళలయితే పార్టీ కోసం, తన మాటకు కట్టుబడి నియోజకవర్గంలో పనిచేస్తారని భావిస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మహిళలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించినా, ముందుగా పార్టీ పదవుల్లో వారికే అగ్రతాంబూలం ఇవ్వాలని పవన్ కల్యాణ్ డిసైడ్ అయినట్లు తెలిసింది. నియోజకవర్గాల ఇన్ ఛార్జుల విషయంలో జరుపుతున్న కసరత్తులో మహిళ పేర్లను ఎక్కువగా పవన్ పరిశీలిస్తున్నారని అంటున్నారు. వచ్చే ఎన్నికల నాటికి మహిళ రిజర్వేషన్లు కూడా అమలు కానుండటంతో పాటు మహిళలయితే వివాదాలకు దూరంగా ఉంటారని పవన్ కల్యాణ్ విశ్వసిస్తున్నారు. జనసేనలో వీర మహిళలకు ప్రత్యేక స్థానం ఉంది. దాదాపు ప్రతి నియోజకవర్గంలోనూ వీర మహిళలున్నారు. వారిలో బలమైన సామాజికవర్గం, ఆర్థిక పరిస్థితులను చూసిన తర్వాత పార్టీ పదవులకు ఎంపిక చేయాలని నిర్ణయించినట్లు సమాచారం. జిల్లా అధ్యక్షులుగా కూడా ఎక్కువ మంది మహిళలకు అవకాశమిస్తే తమకు రాజకీయంగా మైలేజీ దొరకడమే కాకుండా, ఇబ్బందులు కూడా ఉండవని పవన్ కల్యాణ్ భావిస్తున్నారు. అనేక జిల్లాల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు నాయకత్వం తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా పనిచేయకపోవడంతో ప్రకాశం, నెల్లూరు జిల్లాల పార్టీ కార్యవర్గాన్ని అప్పట్లో రద్దు చేశారు. ఇప్పుడు దాదాపు అన్ని పదవులు రద్దయ్యాయి. అలాగే పార్టీ అధికార ప్రతినిధులుగా మహిళలకే చోట కల్పించాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి

## వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

సజ్జల. ఈ కార్యక్రమానికి నాయీ బ్రాహ్మణ విభాగం నేతలతో పాటు ఎమ్మెల్సీలు రమేష్ యాదవ్, లేళ్ల అప్పిరెడ్డి, తదితరులు హాజరయ్యారు. దీనిలో భాగంగా సజ్జల మాట్లాడుతూ.. ‘నాయీ బ్రాహ్మణులను రాజకీయంగా ప్రోత్సహించింది జగనే. వెన్నుపోటు కూటమి అసత్య ప్రచారాలను భూస్థాపితం చేయాలి. వైఎస్సార్‌సీపీ కమిటీల్లో 10 వేల మంది నాయీ బ్రాహ్మణులకు స్థానం. పార్టీ నిర్మాణంలో బీసీలకు 60 శాతానికి పైగా ప్రాతినిధ్యం.జగన్ హయాంలో 15--20 ఏళ్ల అభివృద్ధి, సంక్షేమం అందింది. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని రూ.3 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టింది. అక్రమ కేసులతో వైఎస్సార్‌సీపీ నేతలను వేధిస్తున్నారు. డీఎస్సీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్‌పై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా కూటమి అబద్ధాలను తిప్పికొట్టాలి. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు భవిష్యత్తులో మరిన్ని పదవులుంటాయి. 2029లో జగన్‌ను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యంగా పని చేయాలి. టీటీడీ బోర్డులో నాయీ బ్రాహ్మణులకు జగనే అవకాశం కల్పించారు. దేవాలయ పాలక మండళ్లలో నాయీ బ్రాహ్మణులకు ప్రాతినిధ్యం కల్పించింది జగనే. దేవాలయాల్లో ఉద్యోగులుగా గుర్తింపు, రూ.20 వేల జీతం ఖరారు చేశాం. ప్రతి షాపుకు 150 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చాం. కరోనా సమయంలో ఒక్క బటన్‌తో రూ.50 కోట్ల సాయం చేశాం. నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్‌తో పాటు కీలక పదవులు ఇచ్చిన ఘనత జగన్‌దే. జగన్ చేసిన మేలును ప్రజల్లోకి తీసుకెళ్లాలి’ అని స్పష్టం చేశారు.

## భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వే..

పవిత్రమైన ఉత్తరాంధ్ర గడ్డపై అడుగుపెట్టడం తనకు ఎంతో గర్వకారణమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం సహా సుమారు రూ.18 వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో, తెలుగులో అందరికీ నమస్కారం అంటూ ప్రసంగాన్ని ప్రారంభించారు. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు అర్పించారు. నేటి రోజు ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో, ముఖ్యంగా స్వర్ణాంధ్ర విజన్‌లో ఒక కీలకమైన రోజని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ నృత్యమైన ‘థింసా’ ప్రదర్శన తనను మధురానుభూతికి లోనుచేసిందని ప్రధాని తెలిపారు. ఒకేసారి 13 వేల మంది గిరిజన మహిళలు ఈ నృత్యం చేయడం ఒక అద్భుతమని, ఇది ప్రపంచ రికార్డు సృష్టించిందని కొనియాడారు. ఈ నృత్యంలో మన తరతరాల వారసత్వం స్పష్టంగా కనిపించిందని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతను ప్రధాని మోదీ హృదయపూర్వకంగా అభినందించారు.

భోగాపురం విమానాశ్రయం ఉత్తరాంధ్ర అభివృద్ధికి ఒక కొత్త ‘రన్‌వే’గా పనిచేస్తుందని మోదీ ఉద్ఘాటించారు. ఇది ఆంధ్ర యువత ఉజ్వల భవిష్యత్తుకు ఒక ‘లాంచ్‌ప్యాడ్’ అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గతంలో దేశంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒకే కుటుంబం పేర్లు కనిపించేవని, కానీ తమ ప్రభుత్వం మహనీయుల పేర్లను పెడుతోందని స్పష్టం చేశారు. “అయోధ్యలో విమానాశ్రయానికి వాల్మీకి మహర్షి పేరు పెట్టాం. పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరుతో ఎయిర్‌పోర్ట్ ప్రారంభించాం. అదేవిధంగా భోగాపురం విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం” అని ప్రధాని వివరించారు. ఈ ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌ను వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

## ఉత్తరాంధ్రకు భోగాపురం ఎయిర్‌పోర్ట్ కొత్త అధ్యాయం..

ఉత్తరాంధ్ర అభివృద్ధిలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఒక సరికొత్త అధ్యాయాన్ని లిఖించబోతోందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మార్గదర్శకత్వంలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామి రాష్ట్రంగా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై ప్రశంసలు కురిపించారు. ప్రధాని మోదీ 140 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ దేశాన్ని ‘వికసిత్ భారత్’ దిశగా వేగంగా నడిపిస్తున్నారని పవన్ కొనియాడారు. ఆయన నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఎదుర్కొన్న విమర్శలను పవన్ గుర్తుచేసుకున్నారు. గతంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ప్రధానిని కొందరు విమర్శిస్తున్నప్పుడు తాను చాలా బాధపడ్డానని తెలిపారు. ఎన్ని అవమానాలు ఎదురైనా, వెనక్కి లాగే ప్రయత్నాలు జరిగినా మోదీ ఎక్కడా భయపడలేదని ప్రశంసించారు. మోదీ లాంటి ప్రధాని దేశానికి లభించడం అందరి అదృష్టమని, తనను దూషించిన వారిని కూడా క్షమించే గొప్ప గుణం ఆయనదని పవన్ కల్యాణ్ చెప్పుకొచ్చారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టు ఉత్తరాంధ్రకు మణిహారం..



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారం లాంటిదని, ఈ ప్రాంత దశ, దిశను మార్చే శక్తి దీనికి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. విజయనగరం జిల్లా భోగాపురంలో ‘అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం’ ప్రారంభోత్సవ సభలో ఆయన ప్రసంగించారు. ఒకప్పుడు ఈ ప్రాంతానికి ఎర్రబస్సు కూడా రాదంటూ అవహేళన చేసిన వారు ఇప్పుడు అడ్రస్ లేకుండా పోయారని, కానీ నేడు ఇక్కడకు ఎయిర్‌బస్ వచ్చిందని వ్యాఖ్యానించారు. అభివృద్ధికి అడ్డుపడిన శక్తులను ప్రజలు తిరస్కరించారని అన్నారు.

ఈ విమానాశ్రయానికి భూములిచ్చిన రైతులు ఉత్తరాంధ్ర కొత్త చరిత్రకు శ్రీకారం చుట్టారని చంద్రబాబు ప్రశంసించారు. “రెండేళ్ల క్రితం విధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్ నిర్మిస్తామని ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో నేను, పవన్ కల్యాణ్ హామీ ఇచ్చాం. ఆ హామీని నిలబెట్టుకున్నాం” అని ఆయన తెలిపారు. ఉత్తరాంధ్ర శక్తికి నిదర్శనంగా నిలిచే ఈ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం గర్వకారణమని అన్నారు. ఉత్తరాంధ్ర వాసి జీఎమ్మార్ ఈ ఎయిర్‌పోర్టును నిర్మించడం, దీనికి తొలి అడుగులు వేసిన అశోక్ గజపతిరాజు, ప్రస్తుత కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కూడా ఈ ప్రాంతం వారే కావడం విశేషమని గుర్తుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని కీలక ప్రాజెక్టుల పూర్తిపై చంద్రబాబు స్పష్టత ఇచ్చారు. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రధాని చేతుల మీదుగా జాతికి అంకితం చేస్తామని, 2028 నాటికి రాజధాని అమరావతి తొలి దశ పనులను పూర్తి చేసి ప్రారంభిస్తామని ప్రకటించారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను కాపాడింది, రైల్వే జోన్, పోలవరం, అమరావతికి నిధులు ఇచ్చింది ప్రధాని నరేంద్ర మోదీనే అని కొనియాడారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుతో తెలంగాణ దశ మారినట్లే, భోగాపురం ఎయిర్‌పోర్టుతో ఉత్తరాంధ్ర అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని ధీమా వ్యక్తం చేశారు.

రానున్న రెండేళ్లలో ప్రధాని సహకారంతో ఉత్తరాంధ్రలో రూ.6.13 లక్షల కోట్ల పెట్టుబడులతో 189 ప్రాజెక్టులు తీసుకొస్తామని, తద్వారా 5.57 లక్షల మందికి ఉద్యోగాలు కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.2784 కోట్లతో 8 ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను మూడేళ్లలో పూర్తి చేస్తామని, 65 ఏళ్లుగా పెండింగులో ఉన్న నేరడి బ్యారేజీకి సైతం అనుమతులు వచ్చాయని తెలిపారు. విశాఖ నుంచి భోగాపురం వరకు బీచ్ కారిడార్ నిర్మించి, టూరిజం, ఫార్మా రంగాలను అభివృద్ధి చేసి ఉత్తరాంధ్ర స్వరూపాన్ని మారుస్తామన్నారు. త్వరలోనే ఇతర ప్రాంతాల నుంచి ఉత్తరాంధ్రకు వలసలు వచ్చే రోజులు వస్తాయని, ప్రభుత్వం కల్పించే అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

# విద్యార్థుల కడుపులు మాడ్చుతున్న స్మార్ట్ కిచెన్

-,వైఖరిలో మార్పు రాకపోతే ఆందోళన తీవ్రతరం.

– బద్వేలు ఎమ్మార్వో వద్ద నిరసనలో డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.నాగేంద్ర బాబు హెచ్చరిక.




**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 1 (ప్రజా జ్యోతి)** స్మార్ట్ కిచెన్ పేరుతో బద్వేలు మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కడుపులు మాడ్చుతున్నారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నాయకులు టి.నాగేంద్ర బాబు ఆరోపించారు. శనివారం బద్వేలులోని స్థానిక ఎమ్మార్వో వద్ద ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వేలాపాలా లేకుండా నాణ్యతలేని భోజనాన్ని ఇష్టారాజ్యంగా అందజేయడాన్ని నిరసిస్తూ డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి ఎస్.కె.ఆదిల్, ఎస్ఎఫ్ఐ నాయకులు టి.నాగేంద్ర బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది అమలు చేసిన స్మార్ట్ కిచెన్ విధానంలో భాగంగా బద్వేల్ మండల పరిధిలోని చిన్నకేశం పల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో స్మార్ట్ కిచెన్ ను ఏర్పాటు చేశారన్నారు. స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేసినప్పటి నుండి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదన్నారు. అలాగే సమయపాలన లేకుండా ఇష్టారాజ్యంగా భోజనాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. పాఠశాలల షెడ్యూల్ ప్రకారం 12.15 నిమిషాలకు విద్యార్థులకు భోజనాన్ని అందజేయాల్సి ఉండగా పలు పాఠశాలల్లో 2 గంటలు దాటిన తర్వాత కూడా భోజనం సరఫరా చేస్తున్నారన్నారు. స్మార్ట్ కిచెన్ వారు భోజన సరఫరాకు తగినన్ని వాహనాలు, తగినన్ని వంట పాత్రలు ఏర్పాటు చేసుకోకపోవడం మూలాన దూర ప్రాంతాలకు చాలా ఆలస్యంగా భోజనం అందుతున్నదన్నారు. భోజనం ఆలస్యం కారణంగా విద్యార్థులు ఆకలితో అలమటిస్తూ పలు పాఠశాలల్లో కళ్ళు తిరిగి పడిపోయిన సందర్భాలున్నాయని ఆయన ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల తల్లిదండ్రులు వ్యవసాయ పనులకు వెళ్తారని, భోజనం ఆలస్యమైనప్పుడు విద్యార్థులు ఇళ్లకు వెళ్లి తినే అవకాశం కూడా లేదన్నారు. బద్వేల్ మండలంలో స్మార్ట్ కిచెన్ ప్రారంభించిన కొద్ది రోజుల్లోనే ఐదారుసార్లు మండల పరిధిలోని విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటలు దాటిన తర్వాత భోజనం సరఫరా చేశారన్నారు. భోజనం కోసం పిల్లలు గంటలు గంటలు నిరీక్షించాల్సి రావడం దారుణమన్నారు. స్మార్ట్ కిచెన్ నిర్వాహకులు మెనూ కూడా సక్రమంగా అనుసరించడం లేదని, వారి ఇష్టారాజ్యంగా భోజనం పెడుతున్నారని ఆరోపించారు. విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలనే ప్రభుత్వ లక్ష్యం స్మార్ట్ కిచెన్ ద్వారా నెరవేరడం లేదని పేర్కొన్నారు. రుచి లేని ఆహార పదార్థాలను విద్యార్థులకు వడ్డిస్తున్నారని వారు ఆరోపించారు. గంటలు గంటలు ఆలస్యం కావడం వల్ల పాఠశాలల్లో తరగతులు కూడా విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. ఈ విషయంపై ఇప్పటికే పత్రికల్లో కథనాలు వచ్చాయని, సాక్షాత్తు జిల్లా విద్యాశాఖ అధికారి ఆరోపణలపై విచారణకు వచ్చారని తెలిపారు. అయినప్పటికీ పరిస్థితులలో ఎలాంటి మార్పులు లేవని వారు ఆరోపించారు. మెనూ ప్రకారం వారంలో రెండు మార్లు గుడ్డు కూర, మూడు సార్లు ఉడకబెట్టిన గుడ్డును అందజేయాల్సి ఉండగా, గుడ్డు కూర ఇవ్వకుండా ఉడకబెట్టిన గుడ్డును అందజేస్తున్నారన్నారు. ఈ విషయంలో బద్వేలు మండల విద్యాశాఖ అధికారి సక్రమంగా స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకొని నాణ్యమైన భోజనాన్ని, కాలంలో అందించేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, విద్యా శాఖ మంత్రి కి ఫిర్యాదు చేయడంతో పాటు ఆందోళనను తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ సహాయ కార్యదర్శి సి.సుధాకర్, నాయకులు రామాంజనేయులు, అబ్దుల్ రెహమాన్, రాజు, భాష తదితరులు పాల్గొన్నారు.

# ఎటపాకలో ఉధృతంగా గోదావరి వరద.. స్తంభించిన రాకపోకలు!

మూడో ప్రమాద హెచ్చరిక జారీ.. అప్రమత్తమైన యంత్రాంగం రంగంలోకి రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖల అధికారులు


నెల్లిపాక - శివారు కూనవరం రోడ్‌లో గల పెట్రోల్ బంక్ వద్ద గోదావరి వరద


గన్నవరం మెయిన్ రోడ్డు మార్గంలో రహదారి జలదిగ్బంధంగా మారిన దృశ్యం


చోడవరం చెక్‌పోస్ట్ వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న గోదావరి వరద నీరు.. స్తంభించిన రాకపోకలు

**ఎటపాక, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):**ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో భద్రాచలం వద్ద గోదావరి నది ఉప్పొంగి ప్రవహిస్తోంది. వరద ఉధృతి పెరగడంతో శనివారం మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో ఎటపాక మండలంలోని పలు ప్రధాన రహదారులపై వరద నీరు చేరి రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. భద్రాచలం--కూనవరం ప్రధాన రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో గుండాల, వెంకటరెడ్డిపేట, రాయనపేట, చోడవరం, వెల్లిపాక, తోటపల్లి, గన్నవరం, గౌరీదేవిపేట, నందిగామ, మురుమూరు తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే భద్రాచలం చర్ల ప్రధాన రహదారి లోని ఎటపాక, సీతంపేట, కన్నాయిగూడెం ప్రాంతాల్లోనూ రవాణా పూర్తిగా స్తంభించింది. భద్రాచలం చింతూరు జాతీయ రహదారిపై కూడా వరద నీరు చేరడంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

**అప్రమత్తమైన అధికార యంత్రాంగం**

జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీసు, వైద్య శాఖల అధికారులు సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ముంపు ప్రాంతాల్లో అత్యవసర సేవల కోసం మోటార్ బోట్లు సిద్ధంగా ఉంచడంతో పాటు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బాధితులకు అవసరమైన స హాయం అందిస్తూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు

**కొంత తగ్గిన వరద ఉధృతి**


సీతంపేట, కన్నాయిగూడెం రోడ్ బ్లాక్ అయిన దృశ్యం

శనివారం సాయంత్రానికి గోదావరి వరద ఉధృతి కొంత తగ్గి నీటి మట్టం నిలకడగా ఉండడంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం నాటికి వరద ఉధృతి మరింత తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అయినప్పటికీ ప్రమాద హెచ్చరిక పూర్తిగా ఉపసంహరించే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు..ఈ సందర్భంగా ఎటపాక సీఐ వి. కృష్ణ, ఎస్సై జి. అప్పలరాజు మాట్లాడుతూ ఉప్పొంగుతున్న వాగులు, వంకల్లో చేపల వేటకు వెళ్లవద్దని, వరద నీరు ప్రవహిస్తున్న రహదారులపై ప్రయాణాలు చేయవద్దని హెచ్చరించారు. ముంపు గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించకుండా వైద్యశాఖ ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టిందని తెలిపారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఘనంగా శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ '4.0' పేరెంట్స్ మీటింగ్





## : విద్యార్థుల భవిష్యత్తుకు దిశానిర్దేశం

**కాకినాడ (రామన్ భవన్ క్యాంపస్) (ప్రజా జ్యోతి)** శ్రీ చైతన్య జూనియర్ కాలేజీ రామన్ భవన్ క్యాంపస్‌లో శనివారం తల్లిదండ్రుల సమావేశం 4.0) అత్యంత ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల విద్యా ప్రగతి, వారి ఉజ్వల భవిష్యత్తే ధ్యేయంగా ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమం శ్రీ చైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం హరిప్రసాద్ పర్యవేక్షణలో, కాకినాడ ఏజీఎం రాంబాబు సారథ్యంలో అత్యంత క్రమశిక్షణతో విజయవంతంగా సాగింది. అకాడమిక్ డీన్ ఎం. శ్రీనివాసరావు ప్రత్యేక సహకారంతో, కాలేజీ యాజమాన్యం తల్లిదండ్రులకు అవసరమైన అన్ని వసతులను కల్పించింది.ఈ సందర్భంగా కాలేజీ అధికారులు మరియు అధ్యాపకులు మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అనుసరించాల్సిన పాఠ్యప్రణాళిక గురించి తల్లిదండ్రులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు విద్యార్థుల చదువుల్లో వస్తున్న మార్పులు, వారు సాధించాల్సిన లక్ష్యాలపై విశ్లేషించారు. పిల్లల భవిష్యత్తును ఏ విధంగా తీర్చిదిద్దాలో వివరిస్తూ, తల్లిదండ్రులు ఇంట్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కీలకమైన అకాడమిక్ సూచనలు చేశారు.ఈ మీటింగ్‌కు తల్లిదండ్రుల నుంచి విశేష స్పందన లభించింది. సుమారు 234 మంది విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సమావేశంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. తమ పిల్లల చదువు, ప్రవర్తన మరియు మార్కుల గురించి అధ్యాపకులను అడిగి తెలుసుకున్నారు. కాలేజీ యాజమాన్యం తీసుకుంటున్న ప్రత్యేక శ్రద్ధ పట్ల తల్లిదండ్రులు పూర్తి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులతో పాటు విద్యార్థులు హాజరయ్యారు. శ్రీ చైతన్య రామన్ భవన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ వైస్ ప్రిన్సిపాల్ బోధన సిబ్బంది మరియు బోధనేతర సిబ్బంది అందరూ పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యంగా శ్రీ చైతన్య యాజమాన్యం పనిచేస్తోందని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

# పారదర్శకంగా సమయానికే సంక్షేమ పథకాలు అందాలి

బద్వేల్ మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ

క్షేత్రస్థాయిలో పెన్షన్ల పంపిణీని పరిశీలించిన కమిషనర్ లబ్ధిదారులకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్ ఆగస్టు 1 (ప్రజాజ్యోతి)** ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పారదర్శకంగా, నిర్ణీత సమయానికి అందించేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని బద్వేల్ మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ ఆదేశించారు. పట్టణంలోని పలు ప్రాంతాలలో శనివారం నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఆయన క్షేత్రస్థాయిలో పర్యటించారు. పెన్షన్ పంపిణీ ప్రక్రియను స్వయంగా పరిశీలించిన కమిషనర్, లబ్ధిదారులతో మాట్లాడి నేరుగా పెన్షన్లను అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ మాట్లాడుతూ, పెన్షన్ల పంపిణీ వృద్ధులు, వికలాంగులు, మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పంపిణీ కార్యక్రమాన్ని అత్యంత సక్రమంగా నిర్వహించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ ఫలాలు లబ్ధిదారులకు చేరవేయడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, స్వర్ణ వార్డు సిబ్బంది మరియు ఇతర సంబంధిత సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# నిస్సహాయులకు అండగా కూటమి ప్రభుత్వం సంక్షేమం పథకాలు




**కోవెలకుంట్ల:ఆగస్టు=01 ప్రజాజ్యోతి** అభివృద్ధి తోపాటు సంక్షేమానికి పెద్దపీట వేయడం జరిగిందని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు హామీ ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజల మనసులో చెరగని స్థానాన్ని సంపాదించారు అన్నారు.

# చెన్నూరు రైతుకు సర్వే రిపోర్టు ఇవ్వాలని డిమాండ్

లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా: మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం హెచ్చరిక



**నంద్యాల శిరివెళ్ల:ఆగస్టు=01ప్రజాజ్యోతి** చెన్నూరు, ఆగస్టు =01చెన్నూరు గ్రామానికి చెందిన రైతు గోసుల ఫిలిప్ భూమికి అధికారులు సర్వే నిర్వహించినప్పటికీ ఇప్పటి వరకు సర్వే రిపోర్టు అందజేయకపోవడం అన్యాయమని మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం నాయకులు ఆరోపించారు.ఫిలిప్ దరఖాస్తు చేసి చలానా చెల్లించిన అనంతరం 2026 జూన్ 29న మండల, గ్రామ సర్వేయర్లు భూమిని కొలిచి హద్దులు నిర్ణయించారని తెలిపారు. అయినప్పటికీ సర్వే రిపోర్టును ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని విమర్శించారు.బాధిత రైతుకు వెంటనే సర్వే రిపోర్టు అందజేసి న్యాయం చేయాలని సంఘం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ దేగల చిన్న రాముడు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోప ఆనంద్, రుద్రవరం మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు బాబు, జాయింట్ సెక్రటరీ జై చంద్రుడు డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్య వైఖరిని వీడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తామని మీడియా సమావేశంలో మాలల సంక్షేమ అభివృద్ధి సంఘం నాయకులు హెచ్చరించారు.

# పెద్ద పులి కలేబరానికి పోస్టుమాస్టర్



**నంద్యాల (ఆత్మకూరు):ఆగస్టు=01 ప్రజాజ్యోతి** గిద్దలూరు డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ అధికారిని నిషా కుమారి, నంద్యాల జిల్లా, ఆత్మకూరు డిప్యూటీ డైరెక్టర్ ప్రాజెక్టు టైగర్ విఘ్నేష్ అపోప్వ్ ఆధ్వర్యంలో పెద్దపులి కళేబరాన్ని పరిశీలించి రాచర్ల పశువైద్యాధికారి డి హరిబాబు పర్యవేక్షణలో పెద్దపులి కళేబరానికి పోస్ట్మాస్టర్ నిర్వహించారు. ఇది జరిగిన ప్రదేశం మార్కాపురం జిల్లా, రాచర్ల మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలో అంబచెరువు, తొట్టె మడుగు అడవి పరిసర ప్రాంతమైన లోతు వాగులో పెద్దపులి కలేబరం లభ్యమైనది. ఈ విషయాన్ని తెలుసుకున్న గిద్దలూరు, నంద్యాల జిల్లా ఆత్మకూరు సంఘటన స్థానానికి చేరుకొని పరిశీలించి పోస్టుమార్టం నిర్వహించారు.

## చారిత్రక వారసత్వ పరిరక్షణకు మహత్తర అడుగు బీసీ ఇందిరారెడ్డి




**బనగానపల్లె కొలిమిగుండ్ల ఆగస్టు:ప్రజాజ్యోతి =01** 1600 ఏళ్ల నాటి కొలిమిగుండ్ల "నాలుగు గుళ్ల" పునరుద్ధరణ కార్యక్రమం బాదామీ చాళుక్యుల కాలానికి చెందిన చారిత్రక దేవాలయాల పునరుద్ధరణ
తేదీ: ఆగస్టు 2 (ఆదివారం)
**సమయం:** ఉదయం 8:00 గంటలకు
**స్థలం:** నాలుగు గుళ్ల ప్రాంతం, కొలిమిగుండ్ల
శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి గారి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణం శుభ్రపరిచే కార్యక్రమం ప్రత్యేక పూజలు ఆహ్వానంబనగానపల్లె నియోజకవర్గంలోని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి గారి అభిమానులు, హిందూ సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి."మన చరిత్రను కాపాడుకుందాం...మన వారసత్వాన్ని భావితరాలకు అందిద్దాం."

**ముఖ్య గమనిక:**
భక్తాదులందరికీ శ్రీమతి బీసీ ఇందిరా రెడ్డి గారి ఆధ్వర్యంలో భోజన వసతి ఏర్పాటు చేయబడింది.

## పేదల సేవలో

**ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో పాల్గొన్న ఉమ్మడి కర్నూలు జిల్లా నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పాలకవీటి విజయ కుమార్**



**నంద్యాల( కర్నూల్)ఆగస్టు:01 ప్రజాజ్యోతి** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వర్యులు గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు మరియు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ డి విష్ణువర్ధన్ రెడ్డి గారి మరియు కొడూమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి గారి ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బందితో ఈరోజు కర్నూలు మండలం పసుపుల గ్రామము లో పేదల సేవలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అభివృద్ధిని వివరిస్తూ రాబోయే స్థానిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించవలసిందిగా విన్నవిస్తూ లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమం చేశారు

## చలో డీఈవో కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



**పాఠశాలల లో పనిచేసే మధ్యాహ్నం భోజనం కార్మికులకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ సుంకయ్యపిలుపు**

**నంద్యాల (డోన్):ఆగస్టు=01 ప్రజాజ్యోతి** కనీస వేతనం తో పాటు వివిధ డిమాండ్లతో సోమవారం నిర్వహించే చలో డీఈవో కార్యాలయం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి పి సుంకయ్య మధ్యాహ్న భోజన వర్కర్లకు పిలుపునిచ్చారు.

**స్థానిక డోన్ జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజన వర్కర్స్ కలిశారు.**

ఈ సందర్భంగా పీ సుంకయ్య మాట్లాడుతూ సెంట్రల్ కిచెన్ విధానాన్ని పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, పెరిగిన ధరల కనుగుణంగా మెస్ ఛార్జీలు, జీతాలు పెంచాలని కోరారు గ్యాస్ కొరత విపరీతంగా ఉందని సబ్సిడీ మీద రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేయాలని ఆయన డిమాండ్ చేశారు వంట దగ్గర ఏదైనా ప్రమాదం జరిగితే ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు అంగన్వాడి, ఆశ వర్కర్ల మాదిరిగా గ్రాట్యూటీ ఇవ్వాలి అదేవిధంగా ఎస్ఎంసి కమిటీల పెత్తనం మధ్యాహ్నం భోజనం కార్మికుల మీద ఉండకూడదని అన్నారు ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ డోన్ కార్యదర్శి ఎం పుల్లయ్య, డిప్యూటీ కార్యదర్శి ఎన్ కె రామమోహన్ ట్రెజరర్ సుధాకర్ నాయుడు మధ్యాహ్న భోజనం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రాయల సీమ ఎత్తిపోతల రిజర్వాయర్ ను పరిశీలిస్తున్న కాటసానిరామిరెడ్డి



**బనగానపల్లె( అవుకు) ఆగస్టు:01 ప్రజాజ్యోతి** ఈ నెల అనగా 04-08-2026 వ తేదీ మంగళవారం ఉదయం 11-00 గంటలకు అవుకు రిజర్వాయర్ ను పరిశీలించడానికి గోరుకల్లు రిజర్వాయర్ నుంచి అవుకు రిజర్వాయర్ వరకు పర్యటన కార్యక్రమానికి రాయలసీమ కొఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ,నెల్లూరు జిల్లా వైఎస్సార్సీపీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రకాశం జిల్లా వైఎస్సార్సీపీ అధ్యకులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ,మాజీ మంత్రి సాకే శైలజా నాథ్ రాయలసీమ ప్రాంత వైఎస్సార్సీపీ ముఖ్య నేతలు అందరూ రావడం జరుగుతుంది.కావున అవుకు మండల వైఎస్సార్సీపీ నేతలు,రైతులు ,నియోజకవర్గ వైఎస్సార్సీపీ నాయకులు,కార్యకర్తలు అందరూ హాజరు అయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరడమైనది.అవుకు రిజర్వాయర్ వద్దకు అందరూ రావాలని కాటసాని రామిరెడ్డి కోరారు

# గోదావరి ఉద్ధృతి తో... అప్రమత్తమైన యంత్రాంగం



**ఎస్ఐ రామకృష్ణ, తహసీల్దార్ ధర్మేంద్ర, డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ.**





**కూనవరం, ఆగస్టు 01: ప్రజా జ్యోతి** ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల ప్రభావంతో గోదావరి వరద ఉద్ధృతి కూనవరం మండలంలో క్రమంగా పెరుగుతోంది.పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్న ఎస్ఐ బి. రామకృష్ణ ప్రజలను అప్రమత్తం చేస్తూ తగిన సూచనలు చేస్తున్నారు.మండలంలోని భాస్కర కాలనీలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో డిప్యూటీ ఎంపీడీవో జగన్నాథరావు స్వయంగా అక్కడికి చేరుకుని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలను పర్యవేక్షించారు.అలాగే కూనవరం మరియు పంద్రాజుపల్లి గ్రామ సమీపంలో రహదారిపై వరద నీరు ప్రవహిస్తుండటంతో పరిస్థితిని ఎస్డీసీ బాలకృష్ణ రెడ్డి, తహసీల్దార్ ధర్మేంద్ర, ఎస్ఐ బి.రామకృష్ణతో పాటు ఇతర అధికారులు పరిశీలించి రాకపోకలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు వరద పరిస్థితులపై అధికారులు నిరంతరం నిఘా కొనసాగిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు.

## ఉదయం 7:30 గంటల నుంచే చెన్నూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ ఎంపీడీఓ బి. కిరణ్ మోహన్ రావు




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా, 01-08-2026 తేదీన ఉదయం 7:30 గంటల నుంచే చెన్నూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో ఇంటింటికీ వెళ్లి పెన్షన్ల పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ జి. రాజ్యలక్ష్మి గారు చెన్నూరు గ్రామ పంచాయతీలో పర్యటించి, లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి సామాజిక భద్రతా పెన్షన్లను పంపిణీ చేశారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సంక్షేమం గురించి ఆరా తీసి, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల అమలును పరిశీలించారు.అలాగే ఎంపీడీఓ శ్రీ బి. కిరణ్ మోహన్ రావు గారు కూడా చెన్నూరు గ్రామ పంచాయతీలో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ల పంపిణీని పరిశీలించి, పలువురు వృద్ధులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు స్వయంగా పెన్షన్ అందజేశారు.అదేవిధంగా చెన్నూరు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వెల్ఫేర్ అసిస్టెంట్లు, గ్రామ సచివాలయ సిబ్బంది మరియు సంబంధిత అధికారులు ఇంటి వద్దకే వెళ్లి పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా పెన్షన్ పంపిణీ ప్రక్రియ పారదర్శకంగా, సమయపాలనతో మరియు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, సిబ్బందికి ఎంపీడీఓ సూచనలు చేశారు. పెన్షన్ అందుకున్న వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు మరియు ఇతర లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న ఈ సేవపై హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజ్యలక్ష్మి, పీడీ–డీఆర్డీఏ, ఎంపీడీఓ బి. కిరణ్ మోహన్ రావు, గ్రామ సచివాలయ సిబ్బంది, వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ సిబ్బంది మరియు ఇతర సంబంధిత అధికారులు పాల్గొని పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.
-- ఎంపీడీఓ, చెన్నూరు

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ మరియు 'ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్లు' ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి





**ఎమ్మిగనూరు, అగస్ట్ 01(ప్రజాజ్యోతి ):** పట్టణంలోని 7వ వార్డులో నిర్వహించిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం మరియు "ఎన్డీఏ ప్రభుత్వం రెండేళ్ల ఇంటింటికీ ప్రచార కార్యక్రమంలో" ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర రెడ్డి పాల్గొన్నారు.మొదటగా ఎమ్మెల్యే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను పంపిణీ చేసి, ప్రభుత్వం సామాజిక భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు అనంతరం వార్డులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సూపర్ సిక్స్ హామీలు, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, దీపం పథకం, స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత సుఖీభవ, అన్నా క్యాంటీన్లు, మెగా డీఎస్సీ, ఉపాధి కల్పన కోసం నిర్వహిస్తున్న జాబ్ మేళాలు వంటి కార్యక్రమాల ద్వారా ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని వివరించారు. ఈ సందర్భంగా జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఆగస్టు 7న "నేతన్నల సేవలో" పథకం కింద అర్హులైన చేనేత కుటుంబాలకు రూ. 25,000 ఆర్థిక సహాయం అందజేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. చేనేత కార్మికుల సంక్షేమం, ఆర్థిక భద్రత కోసం కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ప్రజలతో నేరుగా మమేకమై ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి చేర్చడం, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని మరింత మెరుగైన పాలన అందించడం ఈ ఇంటింటికీ ప్రచార కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే బీవీ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కుర్ని కార్పొరేషన్ చైర్మన్ కామర్తి మిన్నప్ప, టీడీపీ పట్టణ అధ్యక్షులు మాచాని మహేష్,కమిటీ సభ్యులు, వార్డు అధ్యక్షులు, వార్డు కమిటీ సభ్యులు, క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైసీపీకి భారీ షాక్.. టీడీపీలోకి 500 మంది చేరిక

**పలు వార్డుల్లో వైసీపీకి భారీ ఎదురుదెబ్బ..**

**ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి సమక్షంలో చేరికలు**



**ఎమ్మిగనూరు, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి):**ఎమ్మిగనూరు పట్టణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. పట్టణంలోని 7, 8, 9 వార్డులకు చెందిన దాదాపు 500 మంది వైసీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలు టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర్‌రెడ్డి సమక్షంలో జరిగిన ఈ చేరికలు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.వైసీపీలో నెలకొన్న రాజకీయ పరిణామాలు, పార్టీ విధానాలపై అసంతృప్తితో పాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై టీడీపీలో చేరుతున్నట్లు పలువురు తెలిపారు.పట్టణ సెక్రటరీ కదిరికోట అనిల్‌కుమార్, వార్డు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైసీపీకి చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీ కండువాలు కప్పుకుని పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బి.వి. జయ నాగేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.పార్టీ బలోపేతానికి కృషి చేయాలి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయ నాగేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ప్రజల ఆశీస్సులు, కూటమి ప్రభుత్వంపై ఉన్న విశ్వాసమే పెద్ద ఎత్తున చేరికలకు కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. టీడీపీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం కల్పిస్తూ, నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని వారు కోరారు.

# తక్షణమే మండల విద్యాశాఖ అధికారులను నియమించి ముంపు మండలాల ఉపాధ్యాయుల జీతాల సమస్యను పరిష్కరించండి

**– జిల్లా కలెక్టర్ శ్రీ కె దినేష్ కుమార్ కి వినతి పత్రం**

**కూనవరం ఆగస్టు 1, ప్రజా జ్యోతి** స్థానిక కూనవరం మండలం నందు వివిధ ఉపాధ్యాయ యూనియన్ల సమక్షంలో పోలవరం జిల్లా కలెక్టర్ శ్రీ కె దినేష్ కుమార్ (ఐ.ఎ.ఎస్) ని కలిసి గత నెల రోజుల నుండి ఉపాధ్యాయులకు జీతభత్యాల బిల్లులు చేయుటకు గాను మరియు పరిపాలన అంశాలు చూసుకొనుటకు గాను రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారి ని నియమించాలని వినతి పత్రం అందించడం జరిగింది. ముంపు మండలాలైన కూనవరం, చింతూరు, వి.ఆర్.పురం మరియు ఎటపాక నాలుగు మండలాలకు సంబంధించి గత రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ) గత నెలలో రిటైయ్యాయి ఉన్నప్పటికిని ఇప్పటికీ ఎవరిని నియమించకపోవడం వలన జీతాలు బిల్లులు చేయుటకు పరిపాలన అంశాలు చూసుకునుటకు సాధ్యపడడం లేదు. దీనివలన ఉపాధ్యాయులు జూలై నెల జీతాలు అందక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. అదేవిధంగా వివిధ రకాలైనటువంటి బ్యాంకు లోన్లు ఉన్నందున సకాలంలో చెల్లించినందున బ్యాంకు వారు కూడా ఒత్తిడి చేస్తున్నారు. ఇంకా సక్రమంగా నెల వారి ఋణ చెల్లింపులు చెల్లించకపోవడం వలన ఉపాధ్యాయులకు సిబిల్ స్కోర్ కూడా పడిపోయి భవిష్యత్తులో ఏ ఇతర రుణాలు తీసుకోవడానికి ఎటువంటి అవకాశం లేకుండా క్రెడిట్ స్కోర్ తగ్గుతుంది. కావున ఈ యొక్క సమస్యను సత్వరమే పరిష్కరించి ఉపాధ్యాయులకు జీతాలు అందేలా చూడాలని అదేవిధంగా మండలాల్లో పాఠశాలలకు,విద్యార్థులకి వివిధ రకాల వసతులు అందడంలో జాప్యం జరుగుతుందని వివరించారు. కావున త్వరితగతిన ఈ విషయమై స్పందించి రెగ్యులర్ మండల విద్యాశాఖ అధికారులను నియమించి జీతభత్యాలు అందించుటకు కృషి చేయగలరని కోరడమైనది. దీనికి గారు కలెక్టర్ గారు స్పందించి ఈ విషయాన్ని వీలైనంత త్వరలో పరిష్కరించి ఉపాధ్యాయులకు జీతాలు అందజేసేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సరియం అనిల్ కుమార్ ( ఏటిఏ), పాయం కన్నారావు (యుటిఫ్) చిచ్చడి జితేంద్ర ( ఏ టి ఏ ), పాయం రాంబాబు (యుటిఫ్) , కట్టం కుమారి, పాయల భవాని, రాధ, పాయం కామేశ్వరరావు మరియు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## శివానగర్‌లో సిసి రోడ్డు పనులను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ కృష్ణ



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి)**బద్వేల్ పట్టణంలోని శివానగర్‌లో జరుగుతున్న సిసి రోడ్డు పనులను శనివారం మున్సిపల్ కమిషనర్ ఎం. కృష్ణ పరిశీలించారు.నిర్మాణంలో వినియోగిస్తున్న మెటీరియల్ నాణ్యత, రోడ్డు మందం, వెడల్పు, క్యూరింగ్ ప్రక్రియ, పనుల పురోగతి తదితర అంశాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు.ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కమిషనర్ పేర్కొన్నారు. అన్ని అభివృద్ధి పనులను నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల అమలులో ఎటువంటి నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. ప్రతి దశలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, పనులు పూర్తయ్యే వరకు తగిన భద్రతా చర్యలు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ ఇంజినీరింగ్ సిబ్బంది, సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇంటింటా తెలుగుదేశం పేట గ్రామం లో పెన్షన్ల పంపిణీ చేసిన -మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, మండల టీడీపీ అధ్యక్షులు కాశీం వలి

**కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన**



**నందవరం, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి):**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, పవన్ కళ్యాణ్, ఆదేశాలు, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డా. బి.వి. జయ నాగేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహిస్తున్న 45 రోజుల ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శనివారం నందవరం మండలం పేట గ్రామంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పేట గ్రామంలోని 29 బూత్‌ల పరిధిలో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కురువ మల్లయ్య, మండల టీడీపీ అధ్యక్షులు కాశీం వలి, క్లస్టర్–1 ఇన్‌చార్జ్ కురువ వీరేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని కుటుంబాలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు.అనంతరం కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి ఇంటింటా తెలుగుదేశం కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేశారు.అలాగే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తామని నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కో–క్లస్టర్ ఇన్‌చార్జ్ సుధీర్, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉదయ్ గౌడ్, కో–యూనిట్ ఇన్‌చార్జ్ సామేలుతో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద బాధితులకు తక్షణ సాయం అందించాలి

**సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్**



**కూనవరం ఆగస్టు 1 ప్రజా జ్యోతి** పోలవరం జిల్లా కూనవరం మండలం రేపాక గ్రామంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సమావేశం పాయం సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్ హాజరై ప్రసంగించారు.

**ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండల వ్యాప్తంగా**

వచ్చిన వరదల కారణంగా ఇళ్లు మునిగిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం వెంటనే ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. అలాగే బాధిత కుటుంబాలకు బియ్యం, పప్పు, నిత్యావసర సరుకులు, తాగునీరు తదితర అత్యవసర సహాయాన్ని తక్షణమే పంపిణీ చేయాలని కోరారు.అదేవిధంగా, ఈరోజు ఉదయం నుంచి ఐదు పంచాయతీల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, వారు “చెవిటోడు చెవిలో శంఖం ఊదినట్లు” నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.ప్రభుత్వ అధికారులు ఇకనైనా స్పందించి, ఆర్‌ఎంబి రోడ్డు మీదుగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసి ఐదు పంచాయతీల ప్రజలకు తక్షణమే విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఐదు పంచాయతీల ప్రజలను సమీకరించి చింతూరు ఐటీడీఏ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా నాయకులు మేకల నాగేశ్వరావు, జిల్లా నాయకురాలు మడకం నాగమణి, మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, మండల కమిటీ సభ్యులు బొగ్గ సుబ్బయ్య, తెల్లం తమయ్య, మడకం జోగయ్య, శాఖ కార్యదర్శి మడకం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు పంపిణీ చేసిన టీడీపీ ఇన్చార్జి మంచూరు సూర్యనారాయణ రెడ్డి

**డోర్ టు డోర్ వెళ్లి లబ్ధిదారులకు అందజేత**



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి)** బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి శనివారం బద్వేలు మున్సిపాలిటీ 25వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అర్హులైన లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి పెన్షన్లను అందజేశారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులను ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు, ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదే వార్డులో “2 ఏళ్ల కూటమి ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి” ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లికి వందనం, స్త్రీ శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం–2, ఎన్టీఆర్ భరోసా తదితర పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికుల సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా కొనసాగుతున్నాయని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు చేరేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ పెన్షన్ పంపిణీ చేసిన 28 వార్డ్ ఇన్చార్జ్ ఉరుకుంద



**ఎమ్మిగనూరు, అగస్ట్ 01(ప్రజాజ్యోతి):**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, మంత్రి నారా లోకేష్ మార్గదర్శకత్వంలో, ఎమ్మెల్యే డాక్టర్ బి.వి. జయనాగేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు 11వ క్లస్టర్, 28వ వార్డు ఇంచార్జ్ ఉరుకుంద పేదల సేవలో భాగంగా అర్హులైన లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల ఆశీస్సులు, అభినందనల మధ్య పెన్షన్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించామని తెలిపారు.

## గోదావరి ముంపు ప్రాంతాల్లో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ క్షేత్రస్థాయి పర్యటన

**గోదావరి నది పరివాహక ప్రాంతాలలో ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ శనివారం క్షేత్రస్థాయిలో పర్యటించారు**







**కూనవరం ఆగస్టు1, ప్రజా జ్యోతి** కూనవరం మండలం పంద్రాజుపల్లి నుండి కోతులగుట్ట వరకు ఉన్న ముంపు ప్రభావిత ప్రాంతాలను ట్రాక్టర్ పై వెళ్లి పరిశీలించి, అక్కడి పరిస్థితులను ప్రత్యక్షంగా అంచనా వేశారు.ఈ పర్యటనలో చింతూరు సబ్ కలెక్టర్ శుభం నొక్వల్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. ముంపు ప్రాంతాల్లో ప్రజల భద్రత, తాగునీరు, ఆహారం, పునరావాసం వంటి అంశాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు.వరదల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రభుత్వ యంత్రాంగం మరియు డిజాస్టర్ మేనేజ్మెంట్ సంస్థలు జారీ చేసే హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సూచించారు.

నది పరివాహక ప్రాంతాల ప్రజలు అనవసరంగా ముంపు ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్థానిక అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

## వైకాపా ముస్లిం , మైనారిటీ నాయకులు ఖాదర్ భాషా కు మాజీ మంత్రి కాకాణి పరామర్శ.




**ముత్తుకూరు, ఆగస్టు 1( ప్రజా జ్యోతి)** తాళ్లపూడి గ్రామ పంచాయతీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఖాదర్ భాషా ను రాష్ట్ర మాజీ మంత్రి, జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి శనివారం పరామర్శించారు. రెండు రోజుల క్రితం ఆయన తనయుడు షేక్ షఫీ ఆకస్మికంగా మరణం చెందారు. ఈ విషయాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధన్ రెడ్డి మాజీ మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన శనివారం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. షఫీ మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. షఫీ కి నివాళులు అర్పించారు. మృతుడి పిల్లలను పలకరించి ఓదార్చినారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కుటుంబానికి అండగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఖాదర్ భాషా కన్నీళ్ళతో ఉండగా మాజీ మంత్రి సముదాయించారు. మాజీ మంత్రి వెంట ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు

## గ్రామాలు పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలి

**: ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**

**జాతీయ రహదారి నూతన తారు రోడ్డు ను పరిశీలించిన ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**



**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** గ్రామాలు, పట్టణాలు అభివృద్ధి చెందాలంటే రవాణా మార్గం మెరుగ్గా ఉండాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. గుత్తి నుంచి గుంతకల్లు బళ్లారి బైపాస్ రోడ్డు వరకు రూ: 30 కోట్లతో నూతనంగా వేస్తున్న జాతీయ రహదారి తారు రోడ్డు ను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, ఆయన సోదరుడు గుంతకల్లు మండలం టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ స్వామి, టిడిపి రాష్ట్ర లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిఎస్ కృష్ణారెడ్డి, బండారు ఆనంద్, మూడో వార్డు టిడిపి ఇన్చార్జి ప్రతాప్ నాయుడు మరియు కూటమి నాయకులతో కలిసి స్థానిక ఇండస్ట్రీ ఏరియా నందు రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఈ రోడ్డు గుంతలు ఏర్పడి ప్రయాణించాలంటేనే చాలా ఇబ్బందిగా ఉండేదని, గత ప్రభుత్వం పట్టించుకోకుండా గత ప్రభుత్వం రోడ్లను పట్టించుకోకుండా వదిలేయ డంతో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, పెద్ద వాహనదారులు చాలా ఇబ్బందులు పడేవారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి న తర్వాత గుత్తి నుంచి గుంతకల్లు బైపాస్ వరకు రూ: 30 కోట్లతో ఈ తారు రోడ్డును నిర్మించడం జరుగుతుందని, ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు అంటేనే అభివృద్ధి అని, కూటమి ప్రభుత్వం ఇలాగే అధికారంలోకి కొనసాగితే రాష్ట్రంలో అనేక పరిశ్రమలు ఏర్పడతాయని, పరిశ్రమలు ఏర్పడితే యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశా లు, అనేక సంక్షేమ పథకా లు వస్తాయని తెలియజేశా రు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రామన్న చౌదరి, జింకల జగన్నాథ్, గుజిరి మహమ్మద్ ఖాజా, నందీశ్వర్, కృపాకర్, ఫ్రూట్ మస్తాన్, ఎన్. రవికుమార్, ఫజులు, ఎల్లప్ప, సురేంద్ర, తలారి మస్తానప్ప, వెంకటేష్ బిజెపి నాయకులు హరిహర నాథ్, పురంధర్, రామాంజనేయులు, టిడిపి మహిళా నేతలు తదితరులు పాల్గొన్నారు.

## పుట్టిన బిడ్డకు ఆరు నెలల లోపు తల్లి పాలు మాత్రమే ఇవ్వాలి.



**పాలకొల్లు / పోడూరు. ప్రజాజ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 1.** పుట్టిన బిడ్డకు జీవితంలో సుస్థిరమైన ప్రారంభానికి పుట్టిన ఒక గంట లోపు నుండి తల్లిపాలు ఇవ్వటం ప్రారంభించాలని మొదటి 6 నెలల పాటు బిడ్డకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని గుమ్ములూరు వైద్యాధికారి పి నరేష్ తెలిపారు. పోడూరు మండలం గుమ్ములూరు లో హెల్త్ వెల్నెస్ క్లినిక్ లో శనివారం జరిగిన తల్లి పాల వారోత్సవం అవగాహన కార్యక్రమం లో అయన మాట్లాడుతూ ఎ యన్ యమ్‌లు, ఆశాలు ఆరోగ్య సిబ్బంది చురుకైన భాగస్వామ్యంతో ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ స్థాయిలో ప్రభావవంతమైన కార్యకలాపాలను నిర్వహించాలని నరేష్ అన్నారు. ఆగస్టు 1 నుండి 7వరకు జరిగే తల్లిపాలు వారోత్సవముల ప్రాముఖ్యతను తెలపాలని సూచించారు. డెలివరీ పాయింట్ల వద్ద చేసే, స్టాఫ్ నర్సులు, ఎ యన్ యమ్ లు, యమ్ యల్ హెచ్ లు ఇతర సిబ్బంది తల్లిపాలు పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె బి కె ఎస్ రమేష్ రెడ్డి, ఆరోగ్య విస్తరణ అధికారి జె సత్యనారాయణ, పి హెచ్ ఎన్ ఎస్ మీరమ్మ ఆరోగ్య పర్యవేక్షకులు సి హెచ్ పద్మ కుమారి ఎ యన్ యమ్ లు శేషారత్నం దివ్య సువర్ణ, హెల్త్ అసిస్టెంట్ జే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## జోరువానలో ఇంటింటికీ పెన్షన్ల పంపిణీలో పాల్గొన్న ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి



**కాకినాడ జిల్లా ఆగస్టు 1 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** మండలంలోని పెద్దనాపల్లి గ్రామంలో శనివారం జోరువానను సైతం లెక్కచేయకుండా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి) లబ్ధిదారులకు ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు.వర్షం కురుస్తున్నప్పటికీ పింఛన్ల పంపిణీ ప్రక్రియకు అంతరాయం కలగకుండా కార్యక్రమాన్ని కొనసాగించారు.ఈ కార్యక్రమంలో నాయకులు బుద్ధ ఈశ్వరరావు, సుంకర సత్యనారాయణ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం కార్యక్రమం విజయవంతం

**– జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్**



**ఎమ్మిగనూరు, అగస్ట్ 01(ప్రజా జ్యోతి ):** ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు, జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో, పట్టణ ఉపాధ్యక్షులు మాజీ కౌన్సిలర్ ముల్లా కలీముల్లా మాజీ కౌన్సిలర్ ఇషాక్ నాయకత్వంలో "2 ఏళ్ల నమ్మకం అభివృద్ధి సంక్షేమం" కార్యక్రమంలో భాగంగా వార్డులో పెన్షన్ పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా లబ్ధిదారులకు పెన్షన్లు అందజేసి, రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, వార్డ్ అధ్యక్షులు చాంద్ బాషా, బాలచంద్ర, రాజు, ఇస్మాయిల్ హిదయతుల్లా, అమానుల్ల కార్యకర్తలు, వార్డు సభ్యులు, అభిమానులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వేడంగిలో నేడు గోగులమ్మ అమ్మవారికి ఆషాడ సారె.



**పాలకొల్లు.ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 1.** పోడూరు మండలం వేడంగి గ్రామంలో వేంచేసియున్న గోగులమ్మ అమ్మవారికి ఈనెల 2 ఆదివారం ఆషాడ సారె సమర్పించనున్నట్లు ఆలయ అధ్యక్ష కార్యదర్శులు బొలిశెట్టి విశ్వేశ్వరరావు కోట రామరావు లు తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు వేడంగి గ్రామంలోని శివాలయం వద్దకు భక్తులు మహిళలందరూ చేరుకుంటారని శివాలయం వద్ద నుండి మంగళ వాయిద్యాలతో ఊరేగింపుగా భక్తులు, మహిళా భక్తులు సారె ను అమ్మ వారి ప్రధాన ఆలయం వద్దకు తీసుకువెళ్తారని వారు తెలిపారు. అమ్మవారికి పూజా కార్యక్రమాలు జరిపి భక్తులు తెచ్చిన సారె ను అమ్మవారికి సమర్పించడం జరుగుతుందనన్నారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం, ప్రసాదం పంపిణీ జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తారని వారు తెలిపారు.

# మూడేళ్ల బకాయిల కోసం జాలర్ల పడవల బంద్

### ఎమ్మార్వో హామీతో విరమించిన ఆందోళన

### పునరుద్ధరించిన పడవల సేవలు



మూడేళ్ల బకాయిల చెల్లింపును డిమాండ్ చేస్తూ నందిగామ-మురుమూరు మధ్య పడవల సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేస్తున్న జాలర్లు.

**ఎటపాక, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):**"కష్టకాలంలో కాపాడేది మేమే... ప్రాణాలకు తెగించి గోదావరి వరద నీటిలో పడవలెక్కి ముంపు బాధితులను ఒడ్డుకు చేర్చేది మేమే... కానీ వరదలు తగ్గాక మమ్మల్ని నడిరోడ్డుపై వదిలేస్తున్నారు. అధికారుల తీరు మార్చుకోకపోతే ఊరుకునేది లేదు!" అంటూ ఎటపాక మండలం త్రిపురపెంటవీడు పంచాయతీకి చెందిన జాలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత మూడేళ్లుగా వరదల సమయంలో అందించిన పడవల సేవలకు సంబంధించిన వేతనాలు, బకాయిలు చెల్లించకపోవడంతో శనివారం జాలర్లు నిరసనకు దిగారు. తమ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నందిగామ--మురుమూరు మధ్య పడవల రాకపోకలను నిలిపివేశారు. దీంతో వరదల సమయంలో పడవలపైనే ఆధారపడే నందిగామ, మురుమూరు గ్రామాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వారు గంటల తరబడి నీటి ఒడ్డునే నిరీక్షించాల్సి వచ్చింది. "వరదలు వచ్చినప్పుడు రాత్రింబవళ్లు పనిచేయించుకుంటారు. పొగడ్తలతో ఆకాశానికి ఎత్తేస్తారు. కానీ వేతనాలు చెల్లించే సమయంలో మాత్రం మమ్మల్ని పట్టించుకోవడం లేదు. మూడేళ్లుగా బకాయిలు ఇవ్వకుండా ఎలా జీవించాలి?" అని జాలర్లు ప్రశ్నించారు. విషయం తెలుసుకున్న ఎటపాక ఎమ్మార్వో ఎం. శ్రీనివాసరావు సంఘటనా స్థలానికి చేరుకుని జాలర్లతో చర్చలు జరిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి కొంత మొత్తాన్ని వెంటనే చెల్లించి, మిగిలిన బకాయిలను త్వరలోనే విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మార్వో హామీతో జాలర్లు తమ ఆందోళనను విరమించి పడవల సేవలను పునరుద్ధరించారు. దీంతో నిలిచిపోయిన రాకపోకలు తిరిగి ప్రారంభమై ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

# రామచంద్రపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొల్లు త్రినాధ్ వర్మ

**--ఎంపీ బోస్ కు కొల్లు త్రినాధ్ వర్మ ఘన సన్మానం**



**అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆగస్టు 01(ప్రజా జ్యోతి (ప్రతినిది)** రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందు కు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రామచంద్రపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది.వైసీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఆర్టీఐ జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాథ్ వర్మ పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను కొల్లు త్రినాథ్ వర్మ ఘనంగా సన్మానించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ప్రచారం కొనసాగించాలని సూచించారు.రామచంద్రపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కొల్లు త్రినాధ్ వర్మ

--ఎంపీ బోస్ కు కొల్లు త్రినాధ్ వర్మ ఘన సన్మానం

**అంబేద్కర్ కోనసీమ జిల్లా**

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందు కు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రామచంద్రపురంలో వైసీపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టింది.వైసీపీ రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్, నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశ్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ఆర్టీఐ జోన్-2 వర్కింగ్ ప్రెసిడెంట్ కొల్లు త్రినాథ్ వర్మ పాల్గొని పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్‌ను కొల్లు త్రినాథ్ వర్మ ఘనంగా సన్మానించారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయానికి సమష్టిగా కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను తెలుసుకుంటూ పార్టీ విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా ప్రచారం కొనసాగించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ డి ధర్మరాజు,మాజీ గ్రామ ప్రెసిడెంట్ వైసీపీ కొప్పాడి వీరయ్య, మాజీ ఎంపీటీసీ బొమ్మిడి బాబురావు, అగ్నికుల క్షత్రియ తాలూకా సంఘం మాజీ డైరెక్టర్ కొల్లి శ్రీనివాసరావు,మాజీ సొసైటీ సభ్యులు మల్లాడి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# కిర్లంపూడిలో ఘనంగా ముద్రగడ సంస్మరణ సభ

**--జనసంద్రంగా మారిన కిర్లంపూడి.. అభిమాన నేతకు ఘన నివాళి**


**--కాపు ఉద్యమ నేతే కాదు..గొప్ప సామాజిక ఉద్యమకారుడు**

**--కాకినాడ జిల్లాకు ముద్రగడ పేరు పెట్టాలని కోరిన పలువురు ప్రముఖులు**



**కాకినాడ జిల్లా ఆగస్టు 1 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)**మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంస్మరణ సభ శనివారం కిర్లంపూడిలో ఘనంగా నిర్వహించారు.కాపు జేఏసీ నాయకుల ఆధ్వర్యంలో,మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా నేతృత్వంలో,మాజీ మంత్రి తోట నరసింహం అధ్యక్షతన జరిగిన ఈ సభకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,ముద్రగడ అభిమానులు,కాపు జేఏసీ నాయకులు, వివిధ పార్టీల నాయకులు భారీగా తరలిరావడంతో కిర్లంపూడి జనసంద్రంగా మారింది.ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.సభను మాజీ మంత్రి తోట నరసింహం జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు.రాజ్యసభ సభ్యుడు వై విసుబ్బారెడ్డి,మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ,దాడిశెట్టి రాజా,అంబటి రాంబాబు,కొట్టు సత్యనారాయణ,కురసాల కన్నబాబు,తానేటి వనిత,గుడివాడ అమర్నాథ్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ,పేర్ని నాని,గొల్లపల్లి సూర్యారావు, శాసనమండలి సభ్యుడు తోట త్రిమూర్తులు,మాజీ ఎమ్మెల్యేలు నాగులపల్లి ధనలక్ష్మి, జ్యోతుల చంటిబాబు,జక్కంపూడి రాజా, ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, చిర్ల జగ్గిరెడ్డి,కరణం ధర్మశ్రీ, పెద్దాపురం వైసిపి ఇన్చార్జ్ దవులూరి దొరబాబు, జక్కంపూడి విజయలక్ష్మి,తలశిల రఘురామ్,అంబటి మురళీ, మాజీ ఎంపీలు వంగా గీత,మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్సీ అంగూరి లక్ష్మీ శివకుమారి,నాయకులు దాట్ల సూర్యనారాయణరాజు, ఒమ్మి రఘురామ్,చింతలపూడి వెంకటరామయ్య,తోట రాంజీ, బదిరెడ్డి గోవిందు,జున్నూరి రామారావు,గొల్లపల్లి కాశీ విశ్వనాథ్,గొల్లపల్లి సురేష్,రామిశెట్టి నాని,గౌతు స్వామి,అడపా సోమేష్,బుద్ధ గణేష్ తదితరుల తో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు, వివిధ పార్టీల నాయకులు సభలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కాపు జాతి అభివృద్ధి,పేద ప్రజల అభ్యున్నతి కోసం తన రాజకీయ భవిష్యత్తును సైతం తృణప్రాయంగా వదిలిపెట్టి పోరాడిన గొప్ప ఉద్యమ యోధుడు ముద్రగడ పద్మనాభం అన్నారు.ముద్రగడ కేవలం కాపు ఉద్యమ నేత మాత్రమే కాదని,గొప్ప సామాజిక ఉద్యమకారుడని కొనియాడారు.దేశ చరిత్రలోనే ప్రత్యేకంగా నిలిచే విధంగా కిర్లంపూడి కాపుల వీధిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నిలువెత్తు విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ఘనత ముద్రగడకే దక్కుతుందని పేర్కొన్నారు.కాపు కార్పొరేషన్ ఏర్పాటు,కాపులకు రుణాల వంటి అంశాలు ముద్రగడ ఉద్యమాల ఫలితంగానే సాధ్యమయ్యాయని పలువురు పేర్కొన్నారు. ముద్రగడ కాపు ఉద్యమం చేయకపోయి ఉంటే కాపు జాతి పరిస్థితి మరోలా ఉండేదని, ఆయన లేని లోటు కాపు జాతికే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రజలకు తీరని లోటని అన్నారు.ముద్రగడ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అన్నారు.ముద్రగడ కుటుంబ సభ్యులు పద్మావతి,కుమారులు ముద్రగడ బాలు,ముద్రగడ గిరిబాబుకు నాయకులు, అభిమానులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ముద్రగడ కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కాకినాడ జిల్లాకు ముద్రగడ పద్మనాభం పేరు పెట్టాలని పలువురు నాయకులు, అభిమానులు ఆకాంక్ష వ్యక్తం చేశారు.కాపు రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు నల్లా విష్ణు,కాపు జేఏసీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు,ఆకుల రామకృష్ణ,తుమ్మలపల్లి రమేష్,కల్వకొలను తాతాజీ,ఆరేటి ప్రకాష్,తోట రామకృష్ణ,తోట రాజీవ్,చినమిల్లి వెంకటరాయుడు అడ్వకేట్ రజని తదితరులతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పలువురు కాపు జేఏసీ నాయకులు,అధిక సంఖ్యలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు, ముద్రగడ అభిమానులు పాల్గొన్నారు. సంస్మరణ సభకు హాజరైన వారికి భోజన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముద్రగడ అనుచరులు, అభిమానులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు.భారీగా తరలివచ్చిన జనంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జగ్గంపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో, కిర్లంపూడి ఎస్సై జి.సతీష్ కుమార్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు.

## వైస్సార్సీపీ మాజీ విద్యార్థి నాయుకుడు పాటిల్ మదన్ మోహన్ రెడ్డిని పరామర్శించిన వై.నైరుతి రెడ్డి



**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** వైస్సార్సీపీ మాజీ విద్యార్థి నాయుడు పాటిల్ మదన్ మోహన్ రెడ్డి అనారోగ్యంతో హాస్పిటల్లో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వైస్సార్సీపీ అనంతపురం జిల్లా ఉపాధ్యక్షురాలు వై.నైరుతి రెడ్డి వేద హాస్పిటల్ కు వెళ్లి పరామర్శించటం జరిగింది. వారితో పాటు వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు ఎం.డి.ఆర్ ఖలీల్, పార్టీ సీనియర్ నాయకులు జయరాం రెడ్డి,మాజీ ఎంపీపీ బోయ రామచంద్ర, యూత్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ బాసీత్,పట్టణ కార్యదర్శి సూర్య తదితరులు ఉన్నారు.

## గొల్లప్రోలులో ఖరీఫ్ నీటి వినియోగంపై సమన్వయ కమిటీ సమావేశంఆరుతడి పంటల వైపు రైతులు మొగ్గు చూపాలి

: తాసిల్దార్ డి.వి. భాస్కర్

వంతుల వారీ విధానంతోనే నీటి సరఫరా: ఇరిగేషన్ అధికారి ఇ. పద్మజ



**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మండల తహశిల్దార్ కార్యాలయంలో శనివారం రెవెన్యూ, ఇరిగేషన్, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు, డిసి మెంబర్లతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాల్లో ఖరీఫ్ 2026 సీజన్‌కు సంబంధించిన నీటి వినియోగంపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సందర్భంగా తహశిల్దార్ డి.వి. భాస్కర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం నీటి భద్రతను పాటించాలని, అంచలవారీగా జరిగే రిక్కీ నిర్వహణకు అందరూ సహకరించాలని కోరారు. మండలంలోని మెరక భూముల్లో రైతులు ఆరుతడి పంటలైన పెసర, మినుము, మొక్కజొన్న వంటి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. వీటికి కావలసిన విత్తనాలను ఇప్పటికే సరఫరా చేశామని తెలిపారు. అలాగే రైతులు తప్పనిసరిగా క్రాప్ ఇన్సూరెన్స్ చేసుకోవాలని, తక్కువ పంట కాల పరిమితి గల వరి వంగడాలను వాడుకోవాలని ఆయన రైతులకు అవగాహన కల్పించారు. మండల ఇరిగేషన్ అధికారి ఇ. పద్మజ మాట్లాడుతూ.. సాగునీటిని వృధా చేయకుండా, రైతులందరూ వంతుల వారీ విధానం ద్వారా సక్రమంగా వినియోగించుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు డి.వి. కొండలరావు, ఏలేరు ప్రాజెక్ట్ వైస్ ప్రెసిడెంట్ ఊట నాని బాబు, మల్లవరం కేవీ భాస్కర్ రెడ్డి, వ్యవసాయ విస్తరణాధికారులు సంధ్య, శైలజ, గ్రామ రెవెన్యూ అధికారులు మరియు మండల పరిధిలోని పలువురు రైతులు పాల్గొన్నారు.

## పిఠాపురంలో వైభవంగా 208వ వారానికి చేరిన "డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం" అన్నదానం



**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)**మహాదాత డొక్కా సీతమ్మ సేవా స్ఫూర్తితో, జనసేన పార్టీ అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు నిర్వహిస్తున్న "డొక్కా సీతమ్మ అన్న సదుపాయ కేంద్రం" సేవా కార్యక్రమం విజయవంతంగా 208వ వారానికి చేరుకుంది.ప్రతి శనివారం పిఠాపురం పశువుల సంత ప్రాంగణంలో ఈ అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా సాగుతోంది. జనసేన పార్టీ గొల్లప్రోలు మండల అధ్యక్షులు జ్యోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ వారం కూడా నిరుపేదలకు, ఆకలితో ఉన్న వారికి ఎంతో ప్రేమతో అన్నప్రసాద వితరణ చేశారు.

**మానవత్వానికి నిదర్శనం:**

ఆకలితో ఉన్న వారి కడుపు నింపడం అనేది అన్నింటికన్నా అత్యున్నతమైన సేవ" అనే నినాదంతో ఈ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పవన్ కళ్యాణ్ సేవా దృక్పథాన్ని, ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ, గొల్లప్రోలు జనసేన శ్రేణుల సహకారంతో ఈ కార్యక్రమం ప్రతి వారం దిగ్విజయంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. ఈ అన్నదానంలో స్థానిక నిరుపేదలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కడుపు నిండా భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, మరియు స్థానిక ప్రజలు పాల్గొని సేవలందించారు.

## వరద ముప్పు నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన ఎరువుల పంపిణీ

రాత్రి రెండు గంటల వరకు రైతులకు డీఏపీ, యూరియా సరఫరా



**ఎటపాక, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):** గోదావరి వరద ముప్పు నేపథ్యంలో ఎటపాక వ్యవసాయ కార్యాలయంలో నిల్వ ఉంచిన ఎరువులను యుద్ధ ప్రాతిపదికన రైతులకు పంపిణీ చేశారు. శుక్రవారం ఎటపాక వ్యవసాయ కార్యాలయానికి చేరిన డీఏపీ, యూరియా ఎరువులను గోదావరి వరద ముప్పును దృష్టిలో ఉంచుకుని వెంటనే రైతులకు అందజేశారు. ఎటపాక వ్యవసాయ కార్యాలయం 52 అడుగుల గోదావరి వరద మట్టానికి ముంపు ప్రాంతంలో ఉండటంతో, వరద నీరు కార్యాలయంలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు గుర్తించారు. దీంతో ఎరువులు ముంపునకు గురికాకుండా ముందస్తు చర్యగా ఎటపాక, పిచ్చుకలపాడు, కన్నాయిగూడెం, సీతంపేట గ్రామాల రైతులకు యాప్ ద్వారా శుక్రవారం రాత్రి రెండు గంటల వరకు నిరంతరాయంగా డీఏపీ, యూరియా ఎరువులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో, సీఈఓ, సొసైటీ చైర్మన్ మాచినేని రాజేష్ స్వయంగా రాత్రి రెండు గంటల వరకు అక్కడే ఉండి రైతులకు ఎరువుల పంపిణీని పర్యవేక్షించారు. ముందస్తు చర్యలు తీసుకోకపోతే గోదావరి వరద నీటిలో మొత్తం ఎరువుల నిల్వ ముంపునకు గురయ్యేదని అధికారులు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వేగంగా ఎరువులు అందించడంతో రైతులు సంతృప్తి వ్యక్తం చేశారు.

# ఎమ్మార్పీఎస్ తొలితరం ఉద్యమ నేత గుంతకల్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు చెరువు నాగరాజు మాదిగ అనారోగ్యంతో కన్నుమూత

మంద కృష్ణ మాదిగ ఆశయ సాధన కోసం చివర శ్వాస వరకు కృషిచేసిన చెరువు నాగరాజు

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ్ మాదిగ ఎమ్మార్పీఎస్ జండా వేసి ఘన నివాళులు

**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తొలితరం ఉద్యమ నేత గుంతకల్లు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకు లు చెరువు నాగరాజు మాదిగ శుక్రవారం రాత్రి అనారోగ్యంతో కన్నుమూ శారు. ఆయన మరణ వార్తను తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు విశ్వనాథ మాదిగ గుంతకల్లు ఎంఆర్పీఎస్ నర్సింహులు మరియు ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి శనివారం గుంతకల్లు లోని చెరువు నాగరాజు మాదిగ స్వగృహమునకు చేరుకొని పూలమాలవేసి ఎమ్మార్పీఎస్ జండా తో ఘనంగా నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ చెరువు నాగరాజు మాదిగ మంద కృష్ణ మాదిగ ఆశయ సాధన కోసం చివర శ్వాస వరకు కృషిచేశారు. మందకృష్ణ ఆదేశాల మేరకు ఎమ్మార్పీఎస్ ప్రతి కార్యక్రమాన్ని ఆయన గుంతకల్లు నియోజక వర్గంలో ప్రతి పల్లెలో తిరుగుతూ ఎమ్మార్పీఎస్ ఆశయాలు ప్రతి మాదిగ జాతి బిడ్డలకు తెలియజే స్తూ, ఉద్యమాలకు ఊపిరి పోస్తూ, మందకృష్ణ మాదిగ పిలుపుమేరకు రాష్ట్రంలో మహాస భలు నిర్వహిస్తే ఆ మహాసభలకు జాతి బిడ్డలను చైతన్యం చేస్తూ మహాసభలకు తరలించే వారిని ఆయన ఎమ్మార్పీఎస్ కు చేసిన సేవలు మరువలేమని, ఎంఆర్పి ఎస్ ఆయన సేవలు తీరనిలోటన్ని తెలిపారు. నివాళులు అర్పించిన వారిలో ప్రజా జ్యోతి విలేఖరి ఆనందరావు, విశాలాంధ్ర విలేఖ రి చిన్న, ఎమ్మార్పీఎస్ నాయకు లు కసాపురం మంజునాథ్ తదితరు నివాళులర్పించారు.





# అధికారుల నిర్లక్ష్యం.. ప్రజల ప్రాణాలతో చెలగాటంమా

ప్రమాదాల పొంచి ఉన్న వేళ..

నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న అధికారులు!

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)** గొల్లప్రోలు మెయిన్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గోతులమయంగా మారిన సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.నిత్యం వందలాది వాహనాలు ప్రయాణించే ఈ ప్రధాన రహదారిపై ప్రయాణం అంటేనే వాహనదారులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.గడచిన కొన్ని నెలలుగా రహదారిపై ప్రమాదకరమైన గోతులు ఏర్పడినా అధికారులు కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంపై ప్రజలు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.పట్టణ శివారు ఎంపీడీవో కార్యాలయం సమీపంలోనూ,పాత బస్టాండ్ వద్ద రహదారిపై భారీ గోతులు ఏర్పడ్డాయి.ముఖ్యంగా ఎంపీడీవో కార్యాలయం వద్ద రోడ్డుపై ఏర్పడిన భారీ గుంతలు ప్రమాదకరంగా మారాయి.ఈ గోతుల్లోకి వర్షపు నీరు చేరి నిలిచిపోవడంతో గుంతలు పడిన విషయం తెలియక వాహనదారులు, మోటార్ సైకిల్ పై వెళ్లేవారు రహదారి అనుకుని ఆ గోతుల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు.పగటిపూట ఎలాగోలా తప్పించుకుని వెళుతున్నప్పటికీ, రాత్రి సమయాల్లో ఈ గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురై గాయపడుతున్నారు. ఫ్యామిలీతో మోటార్ సైకిల్ పై ప్రయాణించే వారు అయితే మరింత ఇబ్బందులకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు.




**అధికారుల నిర్లక్ష్యంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు అసహనం**

గొల్లప్రోలు రహదారిపై నెలల తరబడి గోతులు ఏర్పడినా అధికారులు పట్టించుకోకపోవడంపై టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.ప్రధాన మెయిన్ రోడ్డు మరమ్మతులకు గురైనప్పటికీ సంబంధిత అధికారులు స్పందించకపోవడంపై ఆయన మండిపడ్డారు.ఈ రహదారి నిర్మాణం చేపట్టి చాలా కాలం అవుతున్నందున కేవలం తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా గోతులమయంగా మారిన గొల్లప్రోలు మెయిన్ రోడ్డును నూతనంగా నిర్మించి ప్రజలను ప్రమాదాల బారి నుండి కాపాడాలని అధికారులను కోరుతున్నారు.

## ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెరువు నాగరాజు మాదిగ ఆకస్మిక మరణం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి తీరని లోటు



**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** పాత గుంతకల్లు కు చెందిన ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెరువు నాగరాజు మాదిగ ఆకస్మిక మరణం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీకి జిల్లా కమిటీకి తీరని లోటు. బాధాకరం. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేఎల్ స్వామిదాస్ మాదిగ అన్నారు. ఆయన మాట్లాడుతూ చెరువు నాగరాజు మాదిగ జాతి పట్ల మాదిగల ఆత్మగౌరం పట్ల , ఎస్సీ వర్గీకరణ ఏబిసిడి సాధన కోసం నిరంతరం మాదిగ దండోరా కు అహర్నిశలు వెన్నంటి ఉంటూ, దండోరా ఉద్యమా న్ని ముందుకు నడిపారు. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం, టౌన్ నందు ఎమ్మార్పీఎస్ సభలు సమావేశాలు నందు పాల్గొని జయప్రదం చేయడానికి ఎంతో కృషి చేసిన వ్యక్తి చెరువు నాగరాజు మాదిగ అని ఆయన ఆకస్మికంగా మరణించడం సంఘానికి సమాజానికి కుటుంబానికి తీరని లోటు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలుపుచు న్నాము. ఆయన కుటుంబానికి ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ అండగా ఉంటుందని తెలియజేస్తూ , అమరహే చెరువు నాగరాజు మాదిగ అమరహే జోహార్ చెరువు నాగరాజు మాదిగ, పార్థివ దేహానికీ పూల మాలాలు వేసి నివాళులు అర్పించి, వర్ధిల్లాలి చెరువు నాగరాజు అమరత్వం వర్ధిల్లాలి. అంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాటికాపర్ల సంఘం అధ్యక్షుడు , జగ్గిలి రమేష్, ఎస్సీ ఎస్టీ జేఏసీ కార్యదర్శి, జన్నే మస్తానయ్య, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రమాదానికి గురైన తెదేపా కార్యకర్త సతీష్‌కి ఓదార్పు

ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పిన వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు

త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ పార్టీ అండగా ఉంటుందని భరోసా

**ఎటపాక, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):**ఎటపాక మండలం గౌరీదేవిపేట కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త ములకలపల్లి సతీష్‌ను శనివారం స్థానిక నాయకులు నేరుగా కలిసి పరామర్శించారు. కొద్ది రోజుల క్రితం జరిగిన వాహన ప్రమాదంలో సతీష్ తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం ఇంట్లోనే ఉంటూ కోలుకుంటున్న సతీష్ వద్దకు వెళ్లిన ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు ఆయన ఆరోగ్యం ఎలా ఉందో ఆరా తీశారు. ప్రమాదం జరిగిన విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. సతీష్‌కు ధైర్యం చెబుతూ, త్వరలోనే పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. పార్టీ తరఫున ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఆసరా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, గౌరీదేవిపేట గ్రామ కమిటీ అధ్యక్షుడు అమరవరపు రాము, పూర్వపు సర్పంచ్ శివకనకరాజు, మల్లెల సాగర్, తుంగల సిద్దు, ములకలపల్లి చిన్న వెంకయ్య, భద్రరావు తదితరులు పాల్గొన్నారు.



బాధితుడు సతీష్‌ను పరామర్శిస్తున్న వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, తెదేపా నాయకులు

## వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారిపై మాట్లాడే నైతిక అర్హత నారా చంద్రబాబు, నారా భువనేశ్వరి గారికి లేదు.

-- వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు కాకర్ల నాగేశ్వరరావు



**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** వైఎస్ రాజశేఖర్ రెడ్డి, వైఎస్ జగన్మోహన్ రెడ్డి గురించి విమర్శలు చేసే నైతిక అర్హత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి గానీ, నారా భువనేశ్వరి కి గానీ లేదని వైఎస్సార్సీపీ సీనియర్ నాయకుడు కాకర్ల నాగేశ్వరరావు తీవ్రంగా విమర్శించారు. ఆయన మాట్లాడుతూ దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేరు చెబితే ప్రజలకు జలయజ్ఞం, రైతు సంక్షేమం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, 108 అంబులెన్స్, అనేక అభివృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు గుర్తుకు వస్తాయని అన్నారు. అలాగే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో అమలు చేసిన నవరత్నాలు, సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన ప్రజల మన్ననలు పొందాయని పేర్కొన్నారు. మరోవైపు చంద్రబాబు నాయుడు పేరు చెబితే ప్రజలకు ఎన్నికల హామీల అమలులో వైఫ ల్యం, రాజకీయ మోసాలు, వెన్నుపోటు రాజకీయాలే గుర్తుకు వస్తాయని ఆయన విమర్శించారు. రాజకీయ విమర్శలు చేసే ముందు తమ పాలనలో ప్రజలకు చేసిన మేలు ఏమిటో చెప్పాలని, ఇతరులపై వ్యక్తిగత విమర్శలకు దిగడం మానుకోవాలని కాకర్ల నాగేశ్వరరావు హితవు పలికారు.

# గొల్లప్రోలులో ఇంటింటికీ పించన్ల పంపిణీ

**: లబ్ధిదారులతో ముచ్చటించిన డీఆర్‌డీఏ పీడీ, కమిషనర్ దివిజ సంపతి**

**మంచాని కె పరిమితమైన పేషెంట్‌కు రూ.15,000 పింఛన్ అందజేత**

**కాకినాడ జిల్లా గొల్లప్రోలు (ప్రజా జ్యోతి)**ఈనెల ఒకటో తారీకు పురస్కరించుకుని గొల్లప్రోలు పట్టణంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శనివారం ముమ్మరంగా సాగింది. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ జి. శ్రీనివాస్, గొల్లప్రోలు మున్సిపల్ కమిషనర్ దివిజాసంపతి సంయుక్తంగా పట్టణంలోని 5వ సచివాలయ పరిధిలోని 13వ వార్డులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. క్షేత్రస్థాయిలో పింఛన్ల పంపిణీ జరుగుతున్న తీరును వారు స్వయంగా పరిశీలించారు.వార్డు పర్యటనలో భాగంగా అధికారులు నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో ముచ్చటించారు. "సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి సక్రమంగా పింఛన్ నగదును అందజేస్తున్నారా? ఏమైనా ఇబ్బందులు పెడుతున్నారా?" అని అడిగి ఆరా తీశారు. దీనిపై లబ్ధిదారులు స్పందిస్తూ.. సిబ్బంది ఎటువంటి ఇబ్బందులు పెట్టకుండా, సకాలంలో తమ ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు అందజేస్తున్నారని, వారి పనితీరుపై తాము పూర్తి సంతృప్తితో ఉన్నామని అధికారులకు వివరించారు.అనంతరం పర్యటనలో భాగంగా మంచంపై నుండి కదలలేని స్థితిలో ఉన్న లబ్ధిదారుడు అడబాల సత్తిబాబు ఇంటిని అధికారులు





సందర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న డీఆర్‌డీఏ పీడీ జి. శ్రీనివాస్, కమిషనర్ దివిజాసంపతి.. సత్తిబాబుకు ప్రభుత్వం తరపున అందాల్సిన రూ.15,000/- పింఛను మొత్తాన్ని తమ చేతుల మీదుగా నేరుగా అందజేశారు. కష్టసమయంలో ప్రభుత్వం, అధికారులు తమ ఇంటి వద్దకే వచ్చి ఇంత పెద్ద మొత్తాన్ని అందించడం పట్ల లబ్ధిదారుడి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ, ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఎటువంటి ఇబ్బంది కలగకుండా వారి ఇంటి గుమ్మం వద్దకే పింఛన్లను చేర్చడమే ప్రభుత్వ ముఖ్య ఆశయమని పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది అందరూ ఇదే నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐదవ స్వర్ణ వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రెటరీ అయిన వూటా స్వామి , డి ఆర్ డి ఏ కార్యాలయ సిబ్బంది మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటింటా ఆదరణ అడుగు అడుగున ఆత్మీయ స్వాగతం..

**:-రౌడూరు మరియు కౌతాళం నందు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గుడిసె ఆదికృష్ణమ్మ ఇంచార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి**

**:-ఘన స్వాగతం పలికిన జిల్లా ఉపాధ్యక్షులు చూడి ఉలిగయ్య ,మండల అధ్యక్షులు చూడి సురేష్ నాయుడు**




**కౌతాళం, ఆగష్టు 01 ప్రజా జ్యోతి** తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండేళ్ల సుపరిపాలన సంక్షేమం మరియు అభివృద్ధి,అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలు ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గడపగడప వెళ్లి స్థానిక ప్రజలకు వివరిస్తూ,ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారం దిశగా పని చేస్తామని దీనికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో యువ నాయకులు రాజారెడ్డి స్థానిక నాయకులు టీబి ఎల్ఎల్సీ చైర్మన్ టిప్పు సుల్తాన్, సొసైటీ చైర్మన్ వెంకటపతి రాజు,రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి అడివప్ప గౌడ్,కురువ ఈరన్న, వీరేష్ ,రామలింగ ,చంద్రన్న లక్కే గోవిందు,డాక్టర్ రాజా నందు,గిరి ముకన్న,శివ,ఎల్లయ్య, రాజసబ్,వీరభద్ర, అనిల్, అయ్యప్ప,రమేష్ మొదలగు ప్రజా ప్రతినిధులు పార్టీ శ్రేణులు మొదలగు కూటమి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగినది.

## పురవీధుల్లో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథాయాత్ర





**పొందూరు , ప్రజాజ్యోతి న్యూస్ :**పొందూరు మండల కేంద్రంలో భగవాన్ సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ ఆధ్వర్యంలో సత్యసాయి ప్రేమ ప్రవాహిని రథయాత్ర వైభవంగా జరిగింది. ముందుగా సత్యసాయి మందిరంకు చేరుకున్న ప్రేమ ప్రవాహిని రథానికి కన్వీనర్ రాధాకృష్ణ సేవా సమితి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రశాంతి జెండాను ఊపి,హారతులు ఇచ్చి రథయాత్రను ప్రారంభించారు. అగ్రహారం వీధి ,హాస్పిటల్ వీధి మార్కెట్ రోడ్ , నాయుడు వీధి , శ్రీ సైనా వీధి , కస్పా వీధి, బరంపురం పోస్టాఫీస్ పురవీధుల్లో ఘనంగా రథయాత్రను నిర్వహించారు. మహిళలు ముగ్రాటలతో తిరువీధి ఉత్సవంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా దున్నా రాధాకృష్ణ మాట్లాడు తూ విశ్వశాంతి లోకకళ్యాణం ప్రజల్లో భక్తి భావన ఆధ్యాత్మిక చింతనను పెంపొందించేల ప్రజలను చైతన్య పరచడమే ఈ రథయాత్ర ముఖ్య ఉద్దేశ్యమన్నారు. సత్యసాయి బాబా బోధించిన అందరిని ప్రేమించు, అందరిని సేవించు అనే సందేశాన్ని సమాజంలో విస్తృతం గా ప్రచారం చేయడమే లక్ష్యంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు సేవా సమితి సభ్యులు, బాల వికాస్ విద్యార్థులు పాల్గొన్నారు.

## మిద్దెపల్లె,గ్రామం లో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ



**డోన్ ప్రజా జ్యోతి ఆగస్టు 1** నంద్యాల జిల్లా మిద్దెపల్లి గ్రామంలోడోన్ ఎమ్మెల్యే ఆదేశాల మేరకు తెలుగుదేశం పార్టీ నాయకులు శనివారం ఉదయం 6 గంటలకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్,పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గోవింద్, సుధాకర్,టీడీపీ నాయకులు,పాల్గొని వృద్ధులు, వికలాంగులు, వితంతువులైన లబ్ధిదారులకు ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ సొమ్మును అందజేశారు. లబ్ధిదారుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.క్లస్టర్ ఇంచార్జ్ గోవింద్, సుధాకర్ మాట్లాడుతూ, ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తుంది.ఎన్టీఆర్ భరోసా ద్వారా ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ అందిస్తున్నాం. టీడీపీ నాయకులు ప్రజా సేవలోఎప్పుడూ ముందుంటారుఅని తెలిపారు.పింఛన్ దారులు, ఉదయాన్నే పింఛన్ తీసుకుని తమ సంతోషాన్ని వ్యక్తపరిచారు,

## ప్రభుత్వ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలి పాలిటెక్నిక్ అధ్యాపకుల నల్ల రిబ్బన్లతో నిరసన



**బేతంచెర్ల : ఆగస్టు 1(ప్రజా జ్యోతి)**బేతంచెర్ల పాలిటెక్నిక్ ప్రభుత్వ అధ్యాపకుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులు ప్రభుత్వాన్ని కోరారు. శనివారం కళాశాల ఆవరణలో భోజన విరామ సమయంలో నల్ల రిబ్బన్లు ధరించి శాంతియుతంగా నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా అధ్యాపకుల సంఘం మండల అధ్యక్షుడు కిరణ్ నాయక్, కార్యదర్శి విద్యాసాగర్ మాట్లాడుతూ.. గత ఏడు సంవత్సరాలుగా క్యారియర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) అమలు కాకపోవడంతో పాటు పదోన్నతులు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అధ్యాపకులు వృత్తిపరంగా నష్టపోతున్నారని తెలిపారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి సీఏఎస్‌ను అమలు చేయడంతో పాటు పెండింగ్‌లో ఉన్న పదోన్నతులను మంజూరు చేసి అధ్యాపకులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో అధ్యాపకులు విద్యాసాగర్, విష్ణు, శివశంకర్, ఇర్ఫాన్ ఖాతూన్ తదితరులు పాల్గొన్నారు.

## మద్దిలేటి స్వామి నిత్యాన్నదానానికి రూ.2.50 లక్షల విరాళం



**బేతంచెర్ల: ఆగష్టు1(ప్రజా జ్యోతి)**బేతంచెర్ల మండల పరిధిలోని వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి దాతలు రూ.2.50 లక్షల విరాళం అందజేసినట్లు ఆలయ ఉప కమిషనర్ ఎమ్. రామాంజనేయులు తెలిపారు.నెల్లూరు జిల్లాకు చెందిన ఆవుకు శ్రీకాంత్ తన తండ్రి జ్ఞాపకార్థం రూ.1,00,116 విరాళం అందజేయగా, కర్నూలుకు చెందిన గుర్రం చిన్నస్వామి రూ.50 వేలు, గుర్రం చిన్న మద్దిలేటి రూ.50 వేలు, గుర్రం లక్ష్మీదేవమ్మ రూ.50 వేలు నిత్యాన్నదానానికి విరాళంగా సమర్పించారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయ అధికారులు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో సత్కరించారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకులు నర్రెడ్డి తులసిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేక పూజలు

మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుసోమా అమర్ నాథ్ రెడ్డి



**బ్రహ్మంగారిమఠం -ప్రజా జ్యోతి ఆగస్టు1** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు, మాజీ 20సూత్రాల చైర్మన్,మాజీ రాజ్యసభ సభ్యులు కడప జిల్లా మాజీ జడ్పీ చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ప్రస్తుతం కాంగ్రెస్ కమిటీ (ఏ పీ సి సి) వర్కింగ్ ప్రెసిడెంట్ గా కొనసాగుతున్న నర్రెడ్డి తులసిరెడ్డి 75వ పుట్టిన రోజు సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సోమా అమర్నాథ్ రెడ్డి జగద్గురు శ్రీ వీర బ్రహ్మేంద్ర స్వాముల వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి మచ్చలేని రాజకీయ నాయకులుగా తన రాజకీయ ప్రస్థానం కొనసాగించే క్రమంలో ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకుంటూ వారికి ఆయురారోగ్యం ఆ భగవంతుడు వారికి, వారి కుటుంబానికి ప్రసాదించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను అని తెలిపారు.

## వలసల గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ




నంద్యాల జిల్లా డోన్ మండలంలోనిరాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంవలసల గ్రామంలో ఉదయానే 6 గంటలకు పింఛన్ల పంపిణీ కార్యక్రమంజరిగింది.ఈ కార్యక్రమంలో యూనిట్ కన్వీనర్ ఎం సుధాకర్, బూత్ కన్వీనర్ ఎస్ రామకృష్ణ, బూత్ కో కన్వీనర్ బి శ్రీనివాసులు ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు మేకల లక్ష్మన్న, తలారి వెంకటేశ్వర్లు, ఆర్ చిన్న వెంకటస్వామి, ఎస్ బాల తిమ్మయ్య, బి రంగముని, జింక గణ, మద్దిలేటి, జి చిన్న బాలుడు, ఎస్ జయరాముడులి తదితరులు పాల్గొన్నారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, దివ్యాంగులైన లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేసి వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి పేదల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ఆయన ఆదేశాల మేరకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్లు ఇంటింటికి ఉదయానే అందిస్తున్నాం" అని తెలిపారు.లబ్ధిదారులు ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాషరెడ్డి కిప్రభుత్వానికి, టీడీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## స్థానిక సంస్థ ఎన్నికల్లో సత్తా చాటండి: మండల టిడిపి అధ్యక్షుడు ఉన్నం ఎల్ల నాగయ్య



**బేతంచెర్ల: ఆగస్టు1,(ప్రజా జ్యోతి)** బేతంచెర్ల మండలంలోని అంబాపురం, కొత్తపల్లె, బుక్కాపురం గ్రామాల్లో తెలుగుదేశం పార్టీ చేపట్టిన '2 ఏళ్ల నమ్మకం--సంక్షేమం, అభివృద్ధి--ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఉన్నం ఎల్ల నాగయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. గ్రామస్థులు వినిపించిన సమస్యలు, అవసరాలను నమోదు చేసుకుని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, సంబంధిత అధికారులతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవడం ద్వారా వారి అభిప్రాయాలు తెలుసుకుని ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత సమర్థంగా పనిచేస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో అడ్వకేట్లు భాస్కర్ రెడ్డి, కృష్ణవర్ధన్ రెడ్డి, జాకిరిల్లా బేగ్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, ఆపతి ప్రతాప్ రావు, ఉన్నం సుధాకర్, కౌన్సిలర్ రామాంజనేయులు, హుస్సేనాపురం వెంకటేశ్వర్ రెడ్డి ,లొడ్డ శేఖర్, ఐటీడీపీ మండల అధ్యక్షుడు మరికుంట మాధవ్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్రామాల పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం: ఎంపీడీవో ఫజుల్ రహిమాన్



**బేతంచెర్ల : ఆగస్టు 1(ప్రజా జ్యోతి)** గ్రామాల పరిశుభ్రత కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ కోరారు. గ్రామాలకు వచ్చే స్వచ్ఛ రథం ద్వారా ఇళ్లలో ఉన్న పాత, పనికిరాని వస్తువులను అందజేసి, వాటి బదులుగా నిత్యావసర వస్తువులు పొందవచ్చుని తెలిపారు.గ్రామాల వారీగా స్వచ్ఛ రథం వచ్చిన సమయంలో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అలాగే తడి చెత్తను గ్రామపంచాయతీ సిబ్బందికి అందజేసి, ఘన వ్యర్థాల నిర్వహణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు.ప్రజల సహకారంతోనే గ్రామాలను పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్ద డం సాధ్యమవుతుందని ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ పేర్కొన్నారు.

# జలదిగ్బంధంలో 40 గ్రామాలు








## చింతూరు- వీఆర్పురం మండలాల మధ్య స్తంభించిపోయిన రాకపోకలు

**చింతూరు ఆగష్టు 01 ప్రజాజ్యోతి** చింతూరు మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు శబరి, గోదావరి, పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో సోకిలేరు, కుయగూరు వాగు ఎగపోటు గురవడం తో చింతూరు మండలానికి, వి ఆర్ పురం మండలానికి రాకపోకలు స్తంభించాయి. చింతూరు మండలంలోని కల్లేరు, ముకునూర్, పెదసీతన పల్లి, ఎ జి కోడేరు, వెంకన్నగూడెం,రామవరం, చింతరేవు పల్లి తదితర పంచాయతీలలోని సుమారు 40 గ్రామాలు జలదిగ్బంధంలో ఉన్నాయి.ఎగపోటుకు గురవడంతో జమాయిల్ తోటలు ముంపుకు గురయ్యాయి.ఇది ఇలా ఉండగా జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ చింతూరు విఆర్ పురం కూనవరం మండలాల్లో విస్తృతంగా పర్యటించి ముంపుకు గురైన గ్రామాల్లో మంచినీటి సౌకర్యం, నిత్యావసర వస్తువుల సౌకర్యాలను కలగజేయాలని యూనిట్ అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. ఎప్పటికప్పుడు వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు.ఫ్లడ్ డ్యూటీ లో వున్న అధికారులు వరద పరిస్థితి ని ఎప్పటికప్పుడు సమీక్షించాలని కోరారు.

## కౌతాళంలో ఇంటింటి కార్యక్రమం మరియు పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఉరుకుంద ఈరన్న మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్లు చెన్న బసప్ప మరియు బాపూరం శివ మోహన్ రెడ్డి



**కౌతాళం, ఆగష్టు 01 ప్రజా జ్యోతి** మండల కేంద్రమైన కౌతాళంలోని ఎన్టీఆర్ నగర్, బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక ప్రాంతం మరియు ఎస్సీ కాలనీలలో ఈరోజు ఇంటింటి కార్యక్రమం మరియు పెన్షన్ పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముందు ఎన్టీఆర్ నగర్ లో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఉరుకుంద ఈరన్న స్వామి మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్లు చెన్న బసప్ప మరియు బాపూరం శివ మోహన్ రెడ్డి పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. అదేవిధంగా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించడమే లక్ష్యంగా ఈ ఇంటింటి కార్యక్రమం చేపట్టామని తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుబ్రహ్మణ్యం రాజు, డోమలదిన్నె రమేష్ గౌడ్,రాజాబాబు మంజునాథ,డింగి రఘురాం చౌదరి సోమన్న,చిరంజీవి,నాగరాజు,పుగ్గి నాగప్ప,భాస్కర్, కొండల వెంకటేష్, పంపన్న,బాపూరాం బసవరాజ్, కాలనీవాసులు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జనసేన కార్యకర్త ఆవేదన

**పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు విజ్ఞప్తి**



**కాకినాడ జిల్లా పిఠాపురం (ప్రజా జ్యోతి)** వరదల సమయంలో ప్రాణాలకు తెగించి పనులు చేసినా.. ఇప్పటికీ బిల్లులు చెల్లించకపోవడంతో ఒక జనసేన పార్టీ కార్యకర్త తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన జనసేన కార్యకర్త సురవరపు సత్తిరాజు తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేసి ఆదుకోవాలని పార్టీ అధిష్టానాన్ని, ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కార్యకర్త తెలిపిన వివరాల ప్రకారం.. 2025లో వచ్చిన భారీ వరదల సమయంలో రాపర్తి, గొల్లప్రోలు, నాగులపల్లి ప్రాంతాల్లోని కాళికాదేవి పేట ఏలేరు కాల్వకు పడిన గండీలను పూడ్చే పనులను ఆయన చేపట్టారు. అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో కోటి రూపాయలకు పైగా సొంత నిధులను వెచ్చించి ఈ పనులను పూర్తి చేశారు. అయితే పనులు ముగిసి సుమారు 20 నెలలు గడుస్తున్నా.. ప్రభుత్వ అధికారుల నుండి ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా బిల్లు రూపంలో అందలేదని ఆయన వాపోయారు.సొంత పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, నమ్మి పనులు చేసినందుకు తనకు ఈ పరిస్థితి ఎదురైందని సత్తిరాజు ఆవేదన చెందారు. బిల్లులు రాకపోవడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయానని కన్నీరు పెట్టారు.ఈ తీవ్రమైన సమస్యను స్థానిక శాసనసభ్యులు, రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మరియు పార్టీ ఉన్నత నాయకత్వం దృష్టికి తీసుకెళ్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తగా తన పరిస్థితిని గమనించి, ప్రత్యేక చొరవతో పెండింగ్ బిల్లులు మంజూరు అయ్యేలా చూడాలని, తద్వారా తన్ను, తన కుటుంబాన్ని ఆర్థిక సంక్షోభం నుండి గట్టెక్కించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## శిరివెళ్ల ఎస్సీ కాలనీ లో ఇంటింటికి తెలుగుదేశం

**బూత్ కన్వీనర్ గిత్తల రాజు ఆధ్వర్యంలో విశేష స్పందన.**



**నంద్యాల (శిరివెళ్ల):ఆగస్టు=01ప్రజాజ్యోతి శిరివెళ్ల ఆగస్టు 1 :** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా శిరివెళ్ల మండల కేంద్రములోని ఎస్సీ కాలనీలో గిత్తల రాజు అధ్యక్షతన శని వారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. గిత్తల రాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రముఖులు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని గత రెండేళ్ల కాలంలో ఆళ్లగడ్డ శాసనసభ్యురాలు భూమా అఖిలప్రియ చేసినటువంటి అభివృద్ధి సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. బూత్ లో ఇంటింటికి తిరుగుతూ అభివృద్ధి సంక్షేమాలను వివరిస్తూ ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు ఈ సందర్భంగా బూత్ ఇన్చార్జి గిత్తల రాజు, పల్లె కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం నిరుపేదల కోసం అనేక సంక్షేమ పథకాలను చేపట్టిందన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావడంతో కాలనీ పసుపు భయంగా మారింది ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమానికి విశేష స్పందన లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘం చైర్మన్ సూర రామ టిడిపి యువ నేత బీసీ ఫిదా హుస్సేన్ ఇతర టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి సన్నిధిలో టీడీపీ నాయకులు



**బేతంచర్ల:ఆగష్టు 1(ప్రజా జ్యోతి)**బేతంచర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ శివారులోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో శనివారం ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.మండల టీడీపీ అధ్యక్షులు ఉన్నం ఎల్ల నాగయ్యతో పాటు కర్నూలు అడ్వకేట్లు భాస్కర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, జాకిరిల్లా బేగ్, బుగ్గన ప్రభాకర్ రెడ్డి, అపతి ప్రతాప్ రావు, ఉన్నం సుధాకర్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి నాయకులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు అందించారు.ఈ సందర్భంగా నాయకులు శ్రీ మద్దిలేటి లక్ష్మీ నరసింహ స్వామి కృప ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ విశిష్టత, ఆధ్యాత్మిక ప్రాధాన్యత గురించి తెలుసుకున్నారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న టీడీపీ నాయకుల పర్యటనతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో 10వార్డు కౌన్సిలర్ రామాంజనేయులు, ఐటిడి అధ్యక్షుడు మరికుంట మాధవ్, కొలుపులపల్లె నాగరాజు, రామ నాయుడు, డ్రైవర్ సూరి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను పరామర్శించిన ఎమ్మెల్సీ నర్తు రామారావు

**- ధైర్యంగా ఉండాలని ఓదార్పు**

**- కక్షసాధింపు చర్యలు సరికావని వ్యాఖ్య**



**ఆముదాలవలస, ప్రజాజ్యోతి న్యూస్:**మాజీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంను ఎమ్మెల్సీ నర్తు రామారావు శనివారం ఆముదాలవలసలోని ఆయన నివాసంలో పరామర్శించారు. ఇటీవల చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆయనను ధైర్యంగా ఉండాలని ఓదార్చి, పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా భూ వివాదానికి సంబంధించిన కేసు వివరాలను తమ్మినేని సీతారాం ఎమ్మెల్సీకి వివరించారు.వివాదాస్పద భూమిని చట్టబద్ధంగా కొనుగోలు చేశామని, తామే బాధితులమని భావించి సివిల్ కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సివిల్ వివాదం న్యాయస్థానంలో విచారణలో ఉండగానే రాజకీయ కక్షసాధింపుతో క్రిమినల్ కేసులు నమోదు చేసి అరెస్టులకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.అనంతరం ఎమ్మెల్సీ నర్తు రామారావు మాట్లాడుతూ, రాజకీయ కక్షసాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి మంచివి కావని అన్నారు. చట్టపరమైన పోరాటంలో తమ్మినేని సీతారాంకు వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని, వాస్తవాలు న్యాయస్థానాల ద్వారా వెలుగులోకి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పలాస మున్సిపల్ మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు, రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి బాడాన వెంకట కృష్ణారావు , జిల్లా బీసీ అధ్యక్షుడు అలుగురి పకీర్, జిల్లా బీసీ రైతు సంఘం అధ్యక్షుడు గొలగన రామినాయుడు, కొత్తకోట ఎంపీటీసీ సురవరపు సింహాచలం, గొంటి ఈశ్వరరావుతో పాటు పలాస, కోటబొమ్మాళి ప్రాంతాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వరద ప్రభావిత గ్రామాల్లో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటన

**బోటులో వెళ్లి ప్రజల పరిస్థితుల పరిశీలన**

**-- టార్పాలిన్ల పంపిణీ**





**వేలేరుపాడు :01 ఆగస్ట్ వేలేరుపాడు : వేలేరు పాడు ప్రజాజ్యోతి రిపోర్టర్ (శివరామ్ )**ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత గ్రామాలైన రుద్రమకోట, రేపాకగొమ్ము గ్రామాల్లో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు బోటులో వెళ్లి పర్యటించారు. గ్రామాల్లో పర్యటించి ప్రజలను నేరుగా కలిసి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.తాత్కాలిక పునరావాసం కోసం అవసరమైన టార్పాలిన్లను ప్రజలకు అందజేశారు. వరద తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు.గ్రామాలను ఖాళీ చేసి ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు సురక్షితంగా తరలివెళ్లాలని ప్రజలను కోరారు. వరద పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అధికారులు సూచించే భద్రతా చర్యలను తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సూచించారు. ఈ పర్యటనలో వేలేరుపాడు మండల జనసేన ప్రధాన కార్యదర్శి మేచినేని సంజయ్ టీడీపీ అధ్యక్షులు అమవరపు అశోక్,బీజేపీ అధ్యక్షులు ఒలేటి బాలకృష్ణ, జనసేన నాయకులు బి శివరామ్, జి చంటి , సాయి, వంశీ, వెంకట్, వినోద్, కోడూరి నాగు, ప్రవీణ్, వెంకీ, సతీష్,టీడీపీ నాయకులు చాపర్ల శ్రీను తెలుగు యువత అధ్యక్షులు కే ముత్యాల రావు,బేతి శ్రీను, పోసి, సత్తిబాబు, గోపి పెంటారావు, ఎస్కె సలీం, సంతోష్ తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవు ఎస్సై రామకృష్ణ




**తాళ్లపూడి, ఆగస్టు 1, ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలంలో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడేవారిపై ఉక్కుపాదం మోపుతున్నామని ఎస్సై టి. రామకృష్ణ స్పష్టం చేశారు. గత 30 రోజుల్లో అల్లర్లు సృష్టించిన 10 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు.శనివారం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్, కొవ్వూరు డిఎస్పీ దేవ కుమార్, సిఐ విజయ బాబు ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా నేరగాళ్లపై నిఘా ముమ్మరం చేశామన్నారు. తల్లిదండ్రులను ఇబ్బంది పెట్టే పిల్లలు, రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు పేర్కొన్నారు.శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నేరం చేసిన వ్యక్తి ఎవరైనా సరే నేరుగా అరెస్ట్ చేసి జైలుకు పంపుతామని అన్నారు.అరెస్టులతో పాటు భవిష్యత్తులో యువత, పిల్లలు తప్పుదారి పట్టకుండా కౌన్సెలింగ్ కార్యక్రమాలు కూడా చేపడతామని ఎస్సై తెలిపారు. నేరస్తులను గుర్తించి జైలుకు పంపిన నేపథ్యంలో మండలంలో నేరాల సంఖ్య తగ్గుతుందని మండల ప్రజలు ఎస్సై రామకృష్ణ ను అభినందించారు

## ఎన్టీఆర్ భరోసా పింఛన్ వృద్ధులకు, వికలాంగు లకు, భరోసా



**గుంతకల్లు ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):** కూటమి ప్రభుత్వం ప్రతినెల పింఛన్ చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్ వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు, కిడ్నీ బాధితులకు ఎంతో భరోసా అని గుమ్మనూరు నారాయణ స్వామి అన్నారు. శనివారం గుమ్మనూరు జయరామ్ అన్న ఆదేశాల మేరకు గుంతకల్లు మండలం టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి 37 వార్డులో వార్డు ఇన్చార్జి చికెన్ జగన్నాథ్ మరియు కూటమి నాయకులతో కలిసి వార్డులోని ఇంటింటికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేయడం జరిగింది. నారాయణ స్వామి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిరా వెంటనే 4000 రూపాయలు పింఛన్ పెంచిందని, కూటమి అభివృద్ధి లక్ష్యంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందని అందులో భాగంగానే పట్టణంలోని వార్డులలో కాలువలు సిసి రోడ్లు అభివృద్ధి బాటలో పయనిస్తుందని, డబుల్ ఇంజన్ సర్కార్కు అదే పూర్తితో కూటమి ప్రభుత్వాన్ని ఆదరించాలని 37 వ వార్డు ప్రజలకు ఆయన తెలియజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బసవరాజు, గోవిందు, రాము, బిజెపి స్టేట్ కౌన్సిలర్ మెంబర్ గుర్రం సూర్యనారా యణ బిజెపి జిల్లా ఎగ్జిక్యూట్ మెంబర్ గుంతకల్లు పద్మ, టిడిపి కార్యకర్తలు జీవిత, ఉమాదేవి, లక్ష్మీ మరి టిడిపి కుటుంబ సభ్యులు పాల్గొనడం జరిగినది.

# పండుగ వాతావరణంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్లను అందజేసిన ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**





**కంబదూరు, ఆగస్టు 1:(ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** కంబదూరు మండలం తిమ్మాపురం గ్రామంలో శనివారం ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగింది. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ఆర్డీఓ వసంత్ బాబు, మండల అధికారులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులతో ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ పేదల సంక్షేమంలో ఎలాంటి రాజీ పడటం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ప్రతి నెలా ఒకటో తేదీన లబ్ధిదారుల ఇంటి వద్దకే పింఛన్లు అందించే విధానం ద్వారా వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు భరోసా కల్పిస్తున్నామని చెప్పారు. సంక్షేమంతో పాటు గ్రామీణాభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పేదల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని పేర్కొన్నారు. పింఛన్ అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతి నెలా ఇంటి వద్దకే పింఛన్ అందించడం వల్ల ఇబ్బందులు తొలగిపోయాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సంపత్ కుమార్ మాజీ జెడ్పి విపక్షనేత రామ్మోహన్ చౌదరి, సురేంద్ర మారుతి కాన్వెంట్ నరేష్ తిమ్మాపురం ఎంపీటీసీ కూచినగేష్ తెలుగుదేశం పార్టీ యువ నాయకులు తిమ్మాపురం మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# విద్యార్థులను ప్రోత్సహించేందుకే విద్యా చక్రం ద్వారా సైకిల్ అందిస్తున్నాం.. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు










**కంబదూరు, ఆగస్టు 1: (ప్రజా జ్యోతి) న్యూస్ రిపోర్టర్ ఖాన్,** గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే లక్ష్యంతో కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విద్యాచక్రం కార్యక్రమం ద్వారా సైకిళ్ల పంపిణీ చేపట్టారు. కంబదూరు మండలంలోని తిమ్మాపురం, ములకనూరు, పాళ్లూరు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం ఐదో రోజు విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుస్తులు, షూస్, దుప్పట్లు, క్రీడా దుస్తులతో కూడిన కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పర్యటించినప్పుడు విద్యార్థులు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పాఠశాలలకు వెళ్తున్న దృశ్యాలు చూసి వారికి సైకిళ్లు అందించాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. ఎస్సార్సీ సంస్థ ఆధ్వర్యంలో రూ.5 కోట్ల వ్యయంతో నియోజకవర్గ వ్యాప్తంగా 7,300 సైకిళ్లు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థి ఉన్నత చదువులు అభ్యసించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా కూటమి ప్రభుత్వం: అమిలినేని విద్యార్థుల సంక్షేమం, నాణ్యమైన విద్యకు కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. కంబదూరు మండలంలోని తిమ్మాపురం, ములకనూరు, పాళ్లూరు పాఠశాలల్లో విద్యాచక్రం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విద్యార్థులకు సైకిళ్లు, విద్యార్థులకు విద్యకిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో విద్యా వ్యవస్థ నిర్లక్ష్యానికి గురైందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16,500 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని నియమించిందన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ప్రతి కుటుంబంలోని అర్హులైన విద్యార్థులందరికీ ఆర్థిక సహాయం అందిస్తున్నామని, విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. మూడు పాఠశాలల్లో సైకిళ్లు, హాస్టల్ కిట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కంబదూరు మండలంలోని తిమ్మాపురం, ములకనూరు, పాళ్లూరు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. అలాగే ప్రభుత్వ హాస్టల్ విద్యార్థులకు ట్రంకు పెట్టెలు, దుస్తులు, షూస్, దుప్పట్లు, క్రీడా దుస్తులతో కూడిన కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా తిమ్మాపురం వడ్డే కాలనీలోని దుర్గమ్మ ఆలయానికి రూ.50 వేలు, శ్రీకృష్ణ దేవాలయానికి రూ.1 లక్ష, ఎర్రబండ ఆంజనేయస్వామి ఆలయానికి రూ.1 లక్ష స్వంత నిధులను ప్రకటించారు. గ్రామంలోని ఆర్వో వాటర్ ప్లాంట్ సమస్యను పరిష్కరిస్తామని, రామాలయ కమ్యూనిటీ భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. జడ్పిటిసి రామ్మోహన్ చౌదరి గాజుల శ్రీరాములు లక్ష్మీనారాయణ దండ వెంకటేశులు తలారి ఎర్రి స్వామి సురేంద్ర మోడీ కాన్వెంట్ కూచి నగేష్ తెదేపా యువ నాయకులు నరేష్ ఎంపిటిసి ములుగు క్లస్టర్ ఇంచార్జ్ తిమ్మ రాయుడు మాజీ ఎంపీటీసీ వెంకటా నాయక్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, టీడీపీ నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కూలిన ప్రాజెక్టుల మరమ్మతులకు నిపుణుల నివేదికలకే ప్రాధాన్యం

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



కూలిన సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి పక్షపాతం లేదని సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం, అంతర్జాతీయ నిపుణుల సంస్థలు సమర్పించిన సాంకేతిక నివేదికల ఆధారంగానే మరమ్మతులు చేపడతామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో నిర్మించిన ఆనకట్టలు, ప్రాజెక్టులు ఆరు దశాబ్దాలు పూర్తయినా ఇప్పటికీ దృఢంగా నిలిచి సేవలందిస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన మూడు ప్రధాన ప్రాజెక్టులు కొద్ది సంవత్సరాలకే దెబ్బతిని, నిర్మాణ నాణ్యతపై తీవ్ర సందేహాలు తలెత్తాయని విమర్శించారు. ప్రజాధనాన్ని కాపాడుతూ, నిపుణుల సూచనలకు అనుగుణంగా దెబ్బతిన్న ప్రాజెక్టులను పునరుద్ధరిస్తామని, ఈ ప్రక్రియలో రాజకీయాలకు తావు ఉండదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

# గోదావరి తల్లికి సారె సమర్పించిన మహిళలు

**వరదల ప్రభావం తగ్గాలని ప్రత్యేక పూజలు**

**గ్రామ ప్రజల క్షేమం, పంటల సుభిక్షం కోసం ప్రార్థనలు**





**ఎటపాక, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):** గోదావరి వరదల నేపథ్యంలో ఎటపాక మండలం గన్నవరం గ్రామ మహిళలు శనివారం గోదావరి తల్లికి సారె సమర్పించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుటుంబాలు సుభిక్షంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా పండాలని, వరదల ప్రభావం తగ్గి ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, చీర, గాజులతో అలంకరించిన సారె పళ్లాలను గోదావరి తల్లికి సమర్పించి హారతులు ఇచ్చారు. గ్రామ ప్రజల క్షేమం, ఆయురారోగ్యాలు, శాంతి, సుభిక్షాల కోసం మహిళలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గోదావరి తల్లి కరుణతో వరదల తీవ్రత తగ్గి ప్రజలందరూ సురక్షితంగా ఉండాలని వారు ఆకాంక్షించారు.

## మంత్రి శ్రీ బీసీ జనార్దన్ రెడ్డి గారి పర్యటన



**బనగానపల్లె:ఆగస్టు=01ప్రజాజ్యోతి** రేపు ఉదయం 9:00 గంటలకు, బనగానపల్లె పట్టణంలోని ఆస్థానం రోడ్డులో గల ఓల్డ్ రైస్ మిల్ ప్రాంతంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గౌరవ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి పరిశీలించి, సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం, ఉదయం 11:00 గంటల నుండి, మంత్రి గారి క్యాంపు కార్యాలయంలో నిర్వహించనున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజి ఆర్ యస్ ) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయనున్నారు. కావున, ఈ కార్యక్రమానికి ఎన్ డి,ఎ కూటమి పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మనవి.

## పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో తాళ్లపూడిలో ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక క్యాంప్



**తాళ్లపూడి, ఆగస్టు 1,ప్రజాజ్యోతి న్యూస్** తాళ్లపూడి పోస్టాఫీస్ ఆధ్వర్యంలో స్థానిక మాంటిస్సోరి హైస్కూల్‌లో శనివారం ఆధార్ అప్‌డేట్ ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు తాళ్లపూడి పోస్టుమాస్టర్ శివన్నారాయణ మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాంప్‌లో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆధార్ వివరాల అప్‌డేట్ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆధార్ ఆపరేటర్ ప్రేమ్ మాట్లాడుతూ తాళ్లపూడి పోస్టాఫీస్‌లో శాశ్వత ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆధార్‌లో పేరు, చిరునామా సవరణ, మొబైల్ నంబర్, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి అన్ని సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. పోస్టుమాస్టర్ శివన్నారాయణ మూర్తి మాట్లాడుతూ ఆధార్ సేవలతో పాటు పోస్టల్ శాఖ ద్వారా అందిస్తున్న వివిధ ప్రజా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా రానున్న రోజుల్లో ఇటువంటి ఆధార్ ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తామని తెలిపారు

## గిరిజన ప్రజలకు ముద్రగడ మరణం తీరని లోటు...

**-వైయస్సార్సీపీ నాయకురాలు అన్నిక మంగ..**

**ముద్రగడ సంతాప సభలో గిరిజన మహిళలు...**



**శంఖవరం ఆగస్టు 01, ప్రత్తిపాడు: ప్రజాజ్యోతి న్యూస్** ప్రత్తిపాడు నియోజకవర్గ గిరిజన ప్రజలు ఓ పెద్ద దిక్కును కోల్పోయినట్లయ్యిందని వైయస్సార్సీపీ నాయకురాలు అన్నిక మంగ విచారం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి,కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం సంతాప సభ కిర్లంపూడి ముద్రగడ పద్మనాభం స్వగృహ మందు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సంతాప సభకు ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం సిద్దివారి పాలెం గ్రామం నుండి గ్రామ వైఎస్ఆర్సిపి నాయకురాలు అన్నిక మంగ ఆధ్వర్యంలో గిరిజన మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని ముద్రగడ పద్మనాభం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిద్దివారిపాలెం గ్రామ వైఎస్ఆర్సిపి నాయకురాలు అన్నిక మంగ మాట్లాడుతూ, మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఉద్య మాలకు పెద్ద దిక్కు అని ఆయన మరణం గిరిజనులకు తీరని లోటు అని, గిరిజన ప్రాంత అభివృద్ధికి ఆయన తోడ్పడ్డారని తెలిపారు. ఉద్యమ స్ఫూర్తి,నిజాయితీ, ముక్కుసూటితనం ఉన్న ముద్రగడను కోల్పోవడం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా దురదృష్టమనిఆవేదన వ్యక్తం చేశారు.

## 5వ వార్డులో ఇంటింటికీ ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ



**బద్వేల్ స్టాఫ్ రిపోర్టర్, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి)** బద్వేలు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి, కడప డీసీసీ బ్యాంకు చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 5వ వార్డులో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, బద్వేల్ టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షులు డా. కొంకుల రాంబాబు, టీడీపీ నాయకులు జెట్టిబోయిన సింగరయ్య, సింగసాని రమణయ్య, ముంతల శ్రీ రాములు, యువ నాయకులు కొంకుల రవి, గనుమంతు రాజేష్, రమణ, కొంకుల వెంకటర మణ, కొంకుల చైతన్య, సురే ప్రశాంత్ తదితరులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# అనుపమ, తరుణ్ భాస్కర్‌ల 'క్రేజీ కళ్యాణం' టీజర్ రిలీజ్!

యువ నటి అనుపమ పరమేశ్వరన్, నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'. అఖిల్ రాజ్, సీనియర్ నటుడు నరేష్ వీకే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తుండగా, బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చి సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంటోంది. పెళ్లి వేడుకల నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన సంఘటనలతో, పూర్తిగా నవ్వులు పంచే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు తీర్చిదిద్దినట్లు టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. పెళ్లి అనగానే వచ్చే సందడి, ఆ వెనుక జరిగే సరదా గొడవలు, అనుపమ మరియు తరుణ్ భాస్కర్ ల మధ్య వచ్చే కామిక్ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నరేష్ వీకే మరియు అఖిల్ రాజ్ పాత్రలు ఈ కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాలోని వినోదాత్మక సన్నివేశాలకు తగ్గట్టుగానే ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. టీజర్ లోని ప్రతీ డైలాగ్ మరియు విజువల్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ తో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

## మహేష్ బర్త్‌డే కౌంట్‌డౌన్ మొదలు..

**'వారణాసి' నుంచి స్పెషల్ ట్రీట్ ఉంటుందా, ఫ్యాన్స్‌లో ఉత్కంఠ!**

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని? దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. 'ఆర్‌ఆర్‌ఆర్' వంటి ప్రపంచవ్యాప్త విజయానంతరం రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈసారి కూడా ఫస్ట్ లుక్, పోస్టర్ లేదా చిన్న గ్లింప్స్ విడుదల చేస్తారా? లేక మరికొంత సమయం వేచి చూడాలని చెబుతారా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. ఈ చిత్రంలో ప్రముఖ నటి ప్రియాంక చోప్రా కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ వేదికలపై ఆమె ఈ సినిమా గురించి, రాజమౌళి విజన్ గురించి ప్రస్తావిస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. దీంతో 'వారణాసి'పై గ్లోబల్ మార్కెట్‌లో కూడా మంచి బజ్ ఏర్పడుతోంది.





## 'చైనా పీస్' కాదు ఇకపై 'సీక్రెట్ సోల్జర్'.. రిలీజ్‌కి రెడీ

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో తీసిన యూనిక్ స్పై డ్రామా సినిమా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. టీజర్ అంచనాలను మరింత పెంచింది. ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం.. ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్'గా ప్రేక్షకుల ముందుకు రానుంది. సెన్సార్ బోర్డ్.. యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్‌గా పనిచేశారు. కమల్ కామరాజు, తులసి, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఇతర పాత్రలు చేశారు.

## 'టాక్సిక్' ట్రైలర్ డేట్ ఫిక్స్.. బాక్సాఫీస్ పై యష్ సునామీ!

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8, 2026 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.






## 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ అదిరింది..

**డ్యూయల్ షేడ్స్, కామెడీతో అంచనాలు పెంచిన వరుణ్**

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిధికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు.

Printed by Sree Seshasai Enterprises Published by Vaddi Srinivas Reddy on behalf of Sai Krishna Publications, printed at # 3-88, Chandra Theater, Main Road, Gosala, Krishna District - 521151 Andhra Pradesh and published at D.No. 6-121, 1st Floor, Sphurthy Building, Gosala Village, Urdu School Street, Vijayawada, Krishna District-521151 Andhra Pradesh. Editor Vaddi Srinivas Reddy- 94402 31967 . PRGI No. APTEL/26/A0119,